



# విజయభాను

విశాఖపట్నం, ఆదివారం 04-06-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 218 పేజీలు : 08 వెల : 1 రూపాయి


# కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ట్రాక్ మారడం వల్లే...

# ప్రమాదం

## రైల్వే శాఖ ప్రాథమిక నివేదిక



- 280కు చేరిన మృతుల సంఖ్య, 900 మంది గాయలు
- రైలు మెయిన్ లైన్‌లో వెళ్లేందుకు ముందు సిగ్నల్
- వెంటనే ఆపేయడంతో లోకో-పైలట్ గందరగోళం
- లూప్ లైన్‌లోకి వెళ్లి గూడ్సును ఢీకొట్టినట్టు వెల్లడి
- ముగిసిన సహాయక చర్యలు : రైల్వే శాఖ

ఒడిశా లోని బాలేశ్వర్ జిల్లాలో మూడు రైళ్లు ఒకదానినొకటి ఢీకొన్న ఘటన యావత్ దేశాన్ని తీవ్రంగా కలచివేసింది. వార్త 2లో..


# బాధ్యులపై కఠిన చర్యలు

## ఒడిశా రైలు ప్రమాదంపై ప్రధాని మోదీ



భువనేశ్వర్: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాద ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మోదీ.. ఈ దుర్ఘటనపై ఇప్పటికే ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించామన్నారు. ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాలో రైలు ప్రమాదం జరిగిన ప్రదేశంలో పర్యటించి ప్రమాదానికి గల కారణాలు, సహాయక చర్యల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన ప్రధాని... గాయపడిన వారికి అత్యుత్తమ చికిత్స అందిస్తామన్నారు. 'ఇది చాలా బాధాకరమైన విషయం. తీవ్రమైన ఘటన. దీనిపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరపాలని ఆదేశించాం. ప్రమాదానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తాం. గాయపడిన వారికి తరువాయి 2లో..

# రాష్ట్రానికి 8న అమిత్ షా, 10న నడ్డా రాక



అమరావతి, (విజయభాను న్యూస్) : బీజేపీ అగ్రనేతలు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇద్దరూ రాష్ట్ర పర్యటనకు రాబోతున్నారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ దేశవ్యాప్తంగా మే 30వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కార్యుక్రమాల్లో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈ నెల 8వ తేదీన విశాఖపట్నంలో.. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవ తేదీన తిరుపతికి వస్తారని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. విశాఖపట్నం, తిరుపతిలో రెండు చోట్ల భారీ బహిరంగ సభల నిర్వహణకు బీజేపీ రాష్ట్ర కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

# గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

విజయవాడ, (విజయభాను న్యూస్) : గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. 6,455 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. అభ్యర్థులకు ఉదయం 8:30 గంటల నుంచి 9:30 గంటలలోపు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఇవ్వనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగనుంది. జూన్ 10 వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయి. ఈసారి ఆఫ్ లైన్ లోనే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లాల్లో 11 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్, ఏపీపీఎస్సీ సెక్రటరీ జె.ప్రదీప్ కుమార్ పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. పూర్తి సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణ తరువాయి 2లో..

# ఒడిశా రైలు ప్రమాదంపై సీఎం జగన్ సమీక్ష

## ఎమర్జెన్సీ సేవల కోసం ఆసుపత్రులు అలర్ట్‌గా ఉండాలి



తాడేపల్లి, (విజయభాను న్యూస్) : ఒడిశాలో ఘోర రైలు ప్రమాద ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతూ పోతోంది. కాగా, రైలు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఘటనా స్థలానికి మంత్రి అమర్నాథ్ నేతృత్వంలో ముగ్గురు ఐఏఎస్‌ల బృందాన్ని పంపించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఎంక్వైర్వీ విభాగాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే ఘటనా స్థలానికి పంపించడానికి అంబులెన్స్‌లు సన్నద్ధం కావాలని సూచించారు. ఎమర్జెన్సీ సేవల కోసం విశాఖ సహా ఒడిషా సరిహద్దు జిల్లాల్లో ఆసుపత్రులు అలర్ట్‌గా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద దుర్ఘటన దురదృష్టకరం. ఈ ప్రమాదంలో 50 మందికి పైగా మృతిచెందడం దిగ్భ్రాంతికి గురి చేసింది. రైల్వే అధికారులతో మాట్లాడి ఏపీకి చెందిన బాధితుల వివరాలను సేకరిస్తున్నాం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. వారికి మనస్థైర్యం ఇవ్వాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను.

**కోరమండల్ రైలులో పలువురు ఏపీ రాష్ట్రవాసులు..**

- విజయవాడ రీజియన్‌లో దిగేందుకు మొత్తం 48 మంది రిజర్వేషన్
- కోరమండల్ నుంచి విజయవాడకు 35 మంది రిజర్వేషన్
- ఏలూరుకు రిజర్వేషన్ చేసుకున్న ఇద్దరు ప్రయాణీకులు- తాడేపల్లిగూడెంకు ఒకరు రిజర్వేషన్
- రాజమండ్రి స్టేషన్‌లో దిగేందుకు 12 మంది రిజర్వేషన్.

ఇక, ఈ రైలులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు 124 మంది ప్రయాణీకులు ఉన్నట్టు సమాచారం. రాజమండ్రి స్టేషన్‌లో 24 మంది దిగాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, ఒడిషాలో ఆగివున్న గూడ్స్ రైలును కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడం, పట్టాలు తప్పిన కోరమండల్ బోగీలను యశ్వంతపూర్ రైలు ఢీకొట్టడంలో ఈ ప్రమాదం జరిగింది. కాగా, ఈ ప్రమాదంలో అధికారికంగా ఇప్పటి వరకు 233 మంది ప్రయాణీకులు మృతి చెందగా, వందల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు.

# రైలు ప్రమాదంపై సోనియాగాంధీ ఆవేదన

న్యూఢిల్లీ: ఒడిశా లోని బాలాసోర్‌లో జరిగిన ఘోర రౌలు ప్రమాద ఘటనపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తీవ్ర విచారం వ్యక్తం చేశాయి. ఇది చాలా దురదృష్టకర ఘటన అని అన్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తననెంతో కలిచివేసిందని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తునని అన్నారు.

కాగా, ఘటనా స్థలికి వెళ్లి పరిస్థితిని తెలుసుకోవాలని, కాంగ్రెస్ కార్యకర్తలు, అనుబంధ సంస్థలు చేస్తున్న సహాయక కార్యక్రమాలను సమీక్షించాలని లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరిని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆదేశించారు.

# క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తాం : మంత్రి అమర్నాథ్



అమరావతి, (విజయభాను న్యూస్) : ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద దుర్ఘటన స్థలానికి ముగ్గురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్ అధికారుల బఅందంతో కలిసి ఏపీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అవసరమైతే ఎయిర్ లిఫ్ట్ చేయమని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారని తెలిపారు.రాష్ట్రానికి చెందిన వైద్యుల బృందాన్ని క్షతగాత్రులకు చికిత్స అందించడానికి పంపామని చెప్పారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. మొబైల్ ఫోన్లకు రెస్పాండ్ కాని ప్రయాణికులను గుర్తించే పనిలో ఉన్నామని, శ్రీకాకుళం పరిసర జిల్లాలో ఉన్న ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, అంబులెన్స్‌లను ఘటనా స్థలానికి పంపించాలని సీఎం ఆదేశించారని వెల్లడించారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరువాయి 2లో..



# కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ట్రాక్ మారడం వల్లే..ప్రమాదం



భువనేశ్వర్, (విజయభాను న్యూస్) : ఒడిశా లోని బాలేశ్వర్ జిల్లాలో మూడు రైళ్లు ఒకదానినొకటి ఢీకొన్న ఘటన యావత్ దేశాన్ని తీవ్రంగా కలచివేసింది. భారత రైల్వే చరిత్రలోనే అతిపెద్ద ప్రమాదాల్లో ఒకటిగా నిలిచిన ఈ దుర్ఘటన.. ఎలా జరిగిందన్న దానిపై ఇప్పటివరకు కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. అయితే, సిగ్నల్ లోపం కారణంగా కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ మరో ట్రాక్‌లోకి ప్రవేశించడం వల్లే ఈ పెను విషాదం సంభవించినట్లు రైల్వే శాఖ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఒడిశా ప్రమాదంపై రైల్వే శాఖ ప్రాథమిక దర్యాప్తు నివేదికను విడుదల చేసింది. సిగ్నల్ లోపం కారణంగానే ప్రమాదం జరిగిందని ఆ నివేదికలో పేర్కొంది. ప్రమాదానికి కొద్ది క్షణాల ముందే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్.. లూప్‌లైన్‌లోకి మారినట్లు తెలిపింది. "చెన్నై వెళ్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ మెయిన్ లైన్ కి బదులుగా లూప్ లైన్‌లోకి ప్రవేశించింది. ఈ రైలు మెయిన్‌లైన్‌లోనే చెన్నై వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే, ఈ రైలు పొరపాటున లూప్‌లైన్ లోకి ప్రవేశించింది. అప్పటికే ఆ లూప్‌లైన్‌లో గూడ్స్ రైలును నిలిపి ఉంచారు. దీంతో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ దాన్ని వేగంగా ఢీకొట్టి పట్టాలు తప్పింది. దీని బోగీలు పక్క ట్రాక్‌పైన పడ్డాయి. అదే సమయంలో ఆ ట్రాక్‌పైకి బెంగళూరు-హావ్‌డా ఎక్స్‌ప్రెస్ వచ్చింది. ఈ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 6.50 గంటలకు బహనగ స్టేషన్ దాటింది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 6.52 గంటలకు ఖాంతాపార స్టేషన్‌ను దాటింది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్స్‌ను ఢీకొట్టగానే దాని 21 బోగీలు పట్టాలు తప్పాయి. ఇందులో కొన్ని బోగీలు పక్కనున్న ట్రాక్‌పై పడిపోయాయి. అదే సమయంలో వచ్చిన బెంగళూరు-హావ్‌డా ఎక్స్‌ప్రెస్ వీటిని ఢీకొట్టింది. దీంతో ఈ రైలు బోగీలు కూడా పట్టాలు తప్పాయి" అని రైల్వే శాఖ తమ నివేదికలో వెల్లడించింది.

సిగ్నలింగ్‌లో మానవ తప్పిదం కారణంగానే ఇది జరిగి ఉండొచ్చని రైల్వే అధికారి ఒకరు వెల్లడించారు. ప్రమాద సమయంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గంటకు 130 కి.మీల వేగంతో వెళ్తోంది. దీంతో లూప్‌లైన్ ఉన్న గూడ్స్ రైలును గుర్తించినా వేగాన్ని నియంత్రించలేకపోయినట్లు తెలుస్తోంది. గూడ్స్‌ను ఢీకొట్టగానే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్.. దానిమీదకు దూసుకెళ్లినట్లు రైల్వే అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఫలితంగా కొన్ని బోగీలు గాల్లోకి ఎగిరిపడ్డాయి. దీంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఎంతమంది ప్రయాణికులు ఉన్నారంటే..

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో 1257 మంది రిజర్వ్‌డ్ ప్రయాణికులు ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బెంగళూరు-హావ్‌డా ఎక్స్‌ప్రెస్‌లో 1039 మంది రిజర్వ్‌డ్ ప్రయాణికులు ఉన్నట్లు తెలిపాయి. అయితే వీరు కాకుండా జనరల్ బోగీల్లో ఎంతమంది ఎక్కారన్నది తెలియదు.

సిగ్నల్ ఫెయిల్యూర్ కారణంగానే ప్రమాదం

చెన్నై వెళ్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు సిగ్నల్ లభించకపోవడంతో ప్రమాదం జరిగిందని తేలింది. మొదట సిగ్నల్ ఇచ్చినా ఆ తరువాత దానిని ఆపేశారని, దీంతో



కోరమండల్ రాంగ్ ట్రాక్‌పైకి వెళ్లాల్సి వచ్చిందని తెలిపింది. మెయిన్‌లైన్ బదులు లూప్‌లైన్‌లోకి వెళ్లడంతో.. లూప్‌లైన్‌లో ఉన్న గూడ్స్‌ను రైలును కోరమాండల్ ఢీకొట్టి పట్టాలు తప్పిందని నిపుణుల బృందం తేల్చింది. దీని బోగీలు పక్క ట్రాక్‌పైన పడగా.. అదే సమయంలో ఆ ట్రాక్‌పైకి వచ్చిన బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ వీటిని ఢీకొట్టింది. దీంతో ఈ రైలు బోగీలు కూడా పట్టాలు తప్పాయని అని రైల్వే శాఖ తమ నివేదికలో వెల్లడించింది. కాగా శుక్రవారం ఒడిశా బాలాసోర్ వద్ద ప్రమాదానికి గురైె కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఘటన పెను విషాదానికి కారణమైన విషయం తెలిసిందే. కేవలం 20 నిమిషాల వ్యవధిలోనే మూడు రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి.

ముగిసిన సహాయక చర్యలు : రైల్వే శాఖ

ఒడిశా రైలు ప్రమాదంలో సహాయక చర్యలు పూర్తయినట్లు రైల్వే శాఖ ప్రతినిధి అమితాబ్ శర్మ తెలిపారు. రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు మొదలుపెట్టినట్లు



పేర్కొన్నారు. ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై పూర్తిస్థాయి విచారణ చేపడతామని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ప్రమాదం జరిగిన బాలాసోర్ మార్గంలో కవచ్ వ్యవస్థ లేదని ఆయన తెలిపారు. దాని వల్లే ప్రమాదం తీవ్రత అధికంగా మారిందని పేర్కొన్నారు.

ఆ రూట్లో కవచ్ సిస్టమ్ లేదు

ప్రస్తుతం రెస్క్యూ ఆపరేషన్ ముగిసిందని, ఇక రైల్వే లైన్ పునరుద్దరణ పనులు మొదలుపెడుతున్నామని, ప్రమాదం జరిగిన రూట్లో కవచ్ రక్షణ వ్యవస్థ లేదని తెలిపారు. కాగా రైలు ప్రమాదాలను నివారించేందుకు దేశవ్యాప్తంగా కవచ్ వ్యవస్థను భారత రైల్వేశాఖ డెవలప్ చేస్తోంది. కవచ్ అనేది ఆటోమెటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్. దీనిని మూడు భారతీయ సంస్థలతో కలిసి రిసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్స్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. సమయానికి బ్రేక్ వేయడంలో డ్రైవర్ ఫెయిల్ అయితే కవచ్ సిస్టమర్ రైలు వేగాన్ని ఆటోమెటిక్‌గా నియంత్రిస్తుంది.



# 'కోరమాండల్' కాస్త ముందొచ్చుంటే మరింత ఘోరం జరిగేది



గుంటూరు, (విజయభాను న్యూస్) : ఒడిశా లోని బాలేశ్వర్ జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం యావత్ దేశాన్ని తీవ్రంగా కలచివేసింది. ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. మూడు రైళ్లు ఎలా ఢీకొన్నాయనే దానిపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైల్వే అధికారులు మాత్రం సిగ్నల్ లోపం కారణంగా కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్సు రైలు ఆగి ఉన్న లూప్‌లైన్‌లోకి వెళ్లడం వల్లే ఘోరం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. ఈ దుర్ఘటనపై రైల్వే కన్సల్టేటివ్ కమిటీ మాజీ సభ్యులు ఉప్పులూరి శశిధర్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "ప్రమాదం జరిగిన స్టేషన్‌కు 6.56 గంటలకు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. ప్రాథమిక నివేదిక, రైల్వేబోర్డు సేఫ్టీ వెబ్‌సైట్‌లో ఖరగ్‌పూర్ డివిజన్ అధికారులు అప్‌డేట్ చేసిన ప్రాథమిక సమాచారం బట్టి చూస్తే.. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఆగకుండా మెయిన్‌లైన్ నుంచి వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కానీ, రైలు మెయిన్ లైన్‌లో వెళ్లకుండా గూడ్స్ రైలు ఆగి ఉన్న లూప్ లైన్‌లోకి రావడం వల్లే ప్రమాదం జరిగింది. అక్కడ టైమ్ ప్రకారం లోక్ మోటీవ్ ఆర్టీఎస్‌లో చూస్తే ఏ టైమ్‌కి ఎంత స్పీడ్‌లో రైలు వెళుతుందనేది తెలుస్తుంది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ జీరో సెకన్స్ రావటానికి 6గంటల 55 నిమిషాల 51 సెకన్ల టైమ్‌లోకి వచ్చింది. అప్పటి వరకు నడుస్తున్న ఇంజిన్ జీరో అయిపోయింది. అది జరిగిన నిమిషంలోనే ఎదురుగా మెయిన్ లైన్‌లో వస్తున్న హౌరా-బెంగళూరు రైలు కూడా జీరో కి.మీ స్పీడ్‌కి చేరుకుంది. అంటే దానర్థం కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఎప్పుడైతే లూప్‌లైన్‌లోకి వచ్చి గూడ్స్ రైలును ఢీకొందో.. తర్వాతి నిమిషంలోనే మరో ట్రైన్ పక్కలైన్‌లోకి రావటం వల్ల బోగీలు దానికి తగిలి హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ చివరి బోగీలు కూడా పట్టాలు తప్పాయి. ఉదయం నుంచి సామాజిక మాధ్యమాలు, వివిధ వర్గాల నుంచి వస్తున్న ప్రశ్నల్లో ప్రధానమైన ప్రశ్న ఏంటంటే? ఒక రైలు పట్టాలు తప్పినప్పుడు రెండో రైలుకు సిగ్నల్ ఇవ్వకూడదు. మరి రెండో రైలు ఎందుకొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. కానీ, ఇక్కడ రెండు ట్రైన్ల మధ్య గ్యాప్ నిమిషం కూడా లేదు. మెయిన్‌లైన్‌పై వెళ్లాల్సిన రైలు లూప్‌లైన్‌లోకి వచ్చి గూడ్స్‌రైలును ఢీకొట్టిన నిమిషంలోపే పక్క లైన్‌పై వెళ్తున్న హౌరా ఎక్స్‌ప్రెస్‌పై పట్టాలు తప్పిన రైలు బోగీలు పడటం వల్ల ఆ రైలు బోగీలు కూడా పట్టాలు తప్పాయి. రైల్వేశాఖ ప్రాథమిక నివేదిక బట్టి చూస్తే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు మెయిన్ లైన్‌లో సిగ్నల్ ఇచ్చి క్యాన్సిల్ చేయలేదు. డేటా లాకర్స్‌కు సంబంధించిన రిపోర్ట్స్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ రిపోర్ట్స్ ప్రకారం చూసినా.. స్టేషన్ మాస్టర్ ఇండికేటర్ ఏం చూపిస్తుందనేది తెలుస్తుంది. ఆ ఇండికేటర్‌లో మెయిన్ లైన్ నుంచి వెళ్లమని సూచించారు. కానీ, మెయిన్ లైన్‌లో వెళ్లాల్సిన రైలు లూప్‌లైన్‌లోకి ఎందుకు వెళ్లిందనేదానిపై అధికారులు లోతుగా విచారణ జరపాల్సిన అవసరముంది. సాంకేతిక సమస్య వచ్చినప్పుడు మాత్రమే ఇలా జరుగుతుంది. ఇందులో సిగ్నల్ ఫెయిల్యూర్ అయినా జరిగి ఉండొచ్చు లేదా ఇంజినీరింగ్ విభాగం వైఫల్యమైనా కావొచ్చు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

కోరమాండల్ కంటే ముందే గూడ్స్ రైలు వచ్చింది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు ఓవర్ టేక్ ఇవ్వడం కోసమే గూడ్స్ రైలును లూప్‌లైన్ నిలిపి ఉంచారు. ఆ స్టేషన్ లేఅవుట్‌లో రెండు మెయిన్ లైన్స్, రెండు లూప్ లైన్స్ ఉన్నాయి. రెండు మెయిన్‌లైన్ల మీదుగా రెండింటికీ ఒకేసారి సిగ్నల్ ఇచ్చారు. ఎడమవైపు, కుడివైపు దేని దారిలో ఆ ట్రైన్ వెళ్లిపోయేది. సాధారణంగా బోగీలు పట్టాలు తప్పితే పక్కన ఆగిపోతాయి. కానీ, ఇక్కడ 130 కిలోమీటర్ల వేగంతో కోరమాండల్, గూడ్స్ రైలును ఢీకొట్టడంతో బోగీలు పట్టాలు తప్పి రెండో మెయిన్ లైన్‌పై పడ్డాయి. హౌరా ఎక్స్‌ప్రెస్ ముందు క్రాస్ చేయడంతో చివరి బోగీలు తగిలాయి. అందుకే ఆ రైలుకు ప్రమాద తీవ్రత తక్కువ ఉంది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ కొద్ది నిమిషాల ముందు వచ్చి ఉంటే ప్రమాద తీవ్రత మరింత ఎక్కువగా ఉండేది. హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు మరిన్ని బోగీలు పట్టాలు తప్పేవి" అని ఉప్పులూరి శశిధర్ వివరించారు.

# గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం


జరగనుంది. పరీక్షా కేంద్రాల్లోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేసినట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులకు బయోమెట్రిక్‌తో పాటు తొలిసారి ఫేస్ రికగ్నైజేషన్ విధానం అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఇందుకోసం 70 బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 290 మంది దివ్యాంగులు పరీక్ష రాయనున్నారు. ఇందులో 58 మంది దివ్యాంగులు స్క్రైబ్స్ కు అనుమతి కోరారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెప్పారు.

# బాధ్యులపై కఠిన చర్యలు

ఎటువంటి చికిత్స అవసరమైనా ప్రభుత్వం అందిస్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి సహాయక చర్యల్లో పాల్గొన్న వారికి కృతజ్ఞత తెలుపుతున్నాను' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రమాద ఘటనను పరిశీలించేందుకు దిల్లీ నుంచి ఒడిశా చేరుకున్న మోదీ.. బాహానగా బజార్ స్టేషన్‌కు ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్‌లో ఘటనాస్థలికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితులను పరిశీలించిన అనంతరం, బాలేశ్వర్ జిల్లా ఆస్పత్రిలో ఉన్న బాధితులను పరామర్శించారు. ఆయనతో పాటు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌లు వెంట ఉన్నారు. అంతకుముందు, శనివారం ఉదయం ఇదే విషయమై ఉన్నతాధికారులతో దిల్లీలో సమీక్ష నిర్వహించారు. ఇదిలాఉంటే, ఈ రైలు ప్రమాదంలో మరణించిన వారిసంఖ్య 288కి చేరింది. మొత్తం 747 మంది గాయాలు కాగా అందులో 56 మందికి తీవ్రగాయాలైనట్లు అధికారులు వెల్లడించారు.

# క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తాం : మంత్రి అమర్నాథ్

తరలించేందుకు ఎంత ఖర్చయినా వెనకాడబోమని సీఎం చెప్పారన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి 104, 108 వాహనాలతో పాటు డాక్టర్లను కూడా తరలిస్తున్నామని తెలిపారు.రైలు ప్రమాదంలో 178 మంది తెలుగు వారు ఉన్నారని మంత్రి అమర్నాథ్ తెలిపారు. మఅతులు, గాయపడ్డవారు, మిస్సింగ్ వివరాల సమాచారం అధికారులు సేకరిస్తున్నారని చెప్పారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు, కఅష్ణా జిల్లా కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూమ్‌లు పనిచేస్తున్నాయన్నారు. విజయవాడలో దిగాల్సిన 39 మందిలో 23 మంది కాంటాక్ట్‌లోకి వచ్చారని వెల్లడించారు. ఐదుగురి ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయని.. మరో ఇద్దరి ఫోన్లు నాట్ రిచబుల్ అని వస్తున్నాయన్నారు. ఐదుగురు ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదని మంత్రి వివరించారు.




# రైలు ప్రమాదానికి కొద్ది క్షణాల ముందు ఏం జరిగింది.. : రైల్ ట్రాఫిక్ చార్ట్ విడుదల

భువనేశ్వర్ : ఒడిశాలోని బాలాసోర్ జిల్లా బహనగా రైల్వేస్టేషన్ వద్ద జరిగిన రైలు ప్రమాదానికి కొద్ది క్షణాల ముందు ఏం జరిగింది. అసలు రైల్వే ట్రాఫిక్‌ని ట్రాక్ చేసే వ్యవస్థ సరిగ్గా పనిచేయకపోవడమే ఈ ప్రమాదానికి కారణమా? అసలు ప్రమాదం ఎలా జరిగింది. రైల్వే అధికారులు విడుదల చేసిన లే అవుట్‌లో కీలక విషయాలు బయటపడ్డాయి. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలోని బహనగా రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 280 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరో 900 మందికి పైగా తీవ్రంగా గాయపడి, పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అయితే ఈ ప్రమాదానికి కొద్ది క్షణాల ముందు ఏం జరిగిందో తెలియజేసే రైల్ ట్రాఫిక్ చార్ట్ తాజాగా వెలుగులోకి వచ్చింది. రైలు ట్రాఫిక్‌ను ట్రాక్ చేసేందుకు ఈ వ్యవస్థ ఉపకరిస్తుంది. రైల్వే ట్రాఫిక్ అధికారులు దీనికి సంబంధించి లే అవుట్‌ను విడుదల చేశారు. లే అవుట్ ప్రకారం ప్రమాదం జరిగిన తీరిది..

## నియోజకవర్గ బాధ్యతలను సక్రమంగా నిర్వహించేందుకు కృషి
### - రాష్ట్ర తెదేపా కార్యదర్శి మూర్తి యాదవ్




గాజువాక (విజయభాను న్యూస్ ): నియోజక వర్గం భాద్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాష్ట్ర తెదేపా కార్యదర్శి, సాలూరు నియోజకవర్గం తెదేపా పరిశీలకులు వియ్యపు సత్యనారాయణ మూర్తి (మూర్తి యాదవ్) పేర్కొన్నారు. గుంటూరు మంగళగిరి తెదేపా కేంద్ర కార్యా లయంలో తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు కింజరాపు అచ్చన్నాయుడుల పర్యవేక్షణలో జరిగిన నియోజకవర్గం తెదేపా పరిశీలకుల సమావేశంలో మూర్తి యాదవ్ పాల్గొన్నారు. పరిశీలకులు పార్టీలో చురుకుగా వ్యవహరించాలని,క్యాడర్ ను ఎన్నికలకు సమాయత్తం చేయాలనీ, నెలలో 15రోజులు ప్రజలతో మమేకం అవ్వాలని, సమస్యలను గుర్తించాలని, పరిష్కరానికి భరోసా ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అప్పజెప్పిన భాద్యతలను సక్రమంగా నిర్వహించని వారిని మార్చవలసి వస్తుందని హెచ్చరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పలు నియోజక వర్గాలలోని పరిశీలకులు పాల్గొన్నారు.

# ఈఎస్ఐ ఆసుపత్రిలో నర్సుల "చీటీ" పాటలు

గాజువాక (విజయభాను న్యూస్ ): రోగులకు వైద్య సేవలు అందించవలసిన ఇ ఎస్ ఐ హాస్పిటల్ నర్సులు "చీటీ" పాటలు నిర్వహించడంపై పలువురు రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సొంతపనుల నిర్వహణకు కేరాఫ్ గ నిలవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తు హెడ్ నర్స్ అద్వైర్యంలో తోటి నర్సులు లతో ఆర్థిక లావాదేవీలలో భాగంగా "చీటీ" పాటలు లు నిర్వహించడంపై రోగులు తో పాటు స్థానికులు, ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రతీ నెల జరుగుతున్నా ఈ తంతు పై హాస్పిటల్ ప్రధాన వైద్యాధికారి చూసి చూడనట్లు వ్యవహరించడంపై రోగులు విమర్శల బాణాలు ఎక్కు పెట్టారు. సింధియా గాంధీ గ్రామ్ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఇప్పటికే మందుల కొరతతో వైద్య పరికరాల కొరతతో కార్మికులు వైద్యం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ఆసుపత్రిలో పని చేస్తున్న నర్సులు విధులు పక్కన పెట్టి చీటీ పాటలు పాడుకుంటున్నారు. దింతో వైద్య సేవలు అందక రోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఈ పరిస్థితి అత్యవసర విభాగాలలో మరీ దారుణంగా ఉందని రోగులు కంట తడి పెడుతున్నారు. సాధారణ నర్సుల సేవలు రోగులకు సక్రమంగా అందించే విదంగా ఆసుపత్రి హెడ్డినర్స్ వ్యవహారించ వలసింది పోయి...తానే చీటీ పాటలకు ముఖ్య పాత్ర పోషించడంపై పలువురు రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా ఈ వ్యవహారం మొత్తం వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం పై పలువురు కార్మికులు ఇ ఎస్ ఐ పరువు పోయిం దని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సొమ్మును జీతాలుగా పొందుతున్న సిబ్బంది ఇటు వంటి పనులు చేయడం తగునా అని ప్రశ్నిస్తున్నారు. కార్మికుల కష్టంతో నడుస్తున్న ఈఎస్ఐ ఆసుపత్రిలో ఇలాంటి సంఘటన జరగడం విచార కరమని ప్రజా సంఘాలు వాపో తున్నాయి. తక్షణమే ఈ విషయంపై ఈఎస్ఐ ఆసుపత్రి సూపరిండెంట్ పై, నర్సుల పై జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలు ప్రజా సంఘాల ప్రతినిధులు, రోగులు డిమాండ్ చేస్తున్నారు.



దీనిపై ఇ ఎస్ ఐ హాస్పిటల్ ప్రధాన వైద్యాధికారి రమణమూర్తి ని వివరణ కోరగా..

చీటీ పాటల వ్యవహారం తన దృష్టికి రాలేదని, ఏదైనా ఉంటె పై అధికారులకు తెలియజేసి తగిన చట్ట పరమైన చర్యలు తీసు కుంటామని తెలిపారు.



# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు




గాజువాక (విజయభాను న్యూస్) : కాప్స్ రాక్స్ విశాఖ అడ్మిన్స్ నవీన్ ఆద్వర్యంలో విశాఖ పాస్ పోర్టు ఆఫీసు దరి హేమ ఫంక్షన్ హాల్ లో 250 మంది కాపు తెలగ తూర్పుకాపు బలిజ కులాలకు చెందిన విధ్యార్జులకు ప్రతిభా పురస్కారాలు అందజేసారు. కార్యక్రమానికి ముఖ్య అతిదిగా పాల్గొన్న కేఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ పదవ తరగతిలో ఐదువందలకు పైగా మార్కులు సాదించిన విధ్యార్ధులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వారిని తల్లితండ్రుల సమక్షంలో ఘణంగా సత్కరించి భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి కాప్స్ రాక్స్ వంటి స్వచ్ఛంద సంస్థలకు సహాయం చేసే స్థాయికి ఎదగాలని వారికి చెప్పామని అన్నారు. 2015 లో ముప్పై మందితో పోలీసు అధికారి శివబాస్కర్ సేవా దృక్పథంతో మొదలుపెట్టిన సంస్థ నేడు ప్రపంచ వ్యాప్తంగా పది లక్షల మంది సభ్యులతో నిరంతరం పలు సేవలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జన సేన నాయకులు పంచకర్ల సందీప్, గూటూరు శంకరరావు, పిపి మూర్తి, నిర్వాహకులు రాజు పోతు.మహేష్,లాయర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ



అన్నవరం (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శనివారం సందర్భంగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ వేడుకగా నిర్వహించారు.ముందుగా శ్రీ స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి వేదపండితుల మంత్రోచ్ఛరణ,మంగళ,వాయిద్యాల నడుమ తూర్పు రాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు,అర్చకులు యడవల్లి. వెంకటేశ్వరరావు (చంటి) మరియు దేవస్థానం అధికారులు,సిబ్బంది, భక్తులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాడిరైతులకు అండగా హెరిటేజ్ డెయిరీ
### మేనేజర్ కూండ్రపు శేషు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : పాడిరైతుల రైతులకు హెరిటేజ్ డెయిరీ అండగా ఉంటుందని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. మండలంలో దుప్పుతూరు గ్రామంలో హెరిటేజ్ కి పాలు సరఫరా చేస్తున్న పాడిరైతు శెట్టి చిరంజీవి ఆవులు రెండు కొన్ని రోజుల కిందట మృతి చెందడంతో డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు ఆ రైతుకి శనివారం 30000 వేలు నగదు అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీలో సభ్యత్వం ఉన్న పాడిరైతుకు యాక్సిడెంట్లో మరణించినట్లయితే రెండు లక్షల రూపాయలు అదేవిధంగా సహజం సహజంగా మరణిస్తే అయితే 50 వేల రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శెట్టి కాసుబాబు, శెట్టి శంకర్రావు, దేశంశెట్టి తాతయ్యలు, దేశంశెట్టి సోమరాజు. శెట్టి చిన్న కాసుబాబు, శెట్టి నాని అప్పారావు, దూది అప్పారావు, శెట్టి చందర్రావు, రమేష , శెట్టి సూరిబాబు, దూది నానాజీ , శెట్టి రాంబాబు, శెట్టి నరసింహారావు తదితర పాడిరైతులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలి
### - మంత్రి శ్యాం ప్రసాద్




అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : మానవహక్కుల కౌన్సిల్ సభ్యులు, ప్రతినిధులకు క్రమశిక్షణ తప్పనిసరని కౌన్సిల్ కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్ తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విధుల నిర్వహణకు సంబంధించి కౌన్సిల్ సభ్యులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణ, చట్టాలపై కౌన్సిల్ సభ్యులకు అవగాహన తప్పని సరని పేర్కొన్నారు. బాధితులపై కౌన్సిల్ సభ్యులు బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవహక్కుల కౌన్సిల్ వాలంటీర్లు తమకు తామే జవాబు దారీగా, నిజాయితీగా ఉండాలని, మానవ హక్కుల పరిరక్షణకు మాత్రమే కట్టుబడి పని చేయాలని స్పష్టం చేసారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ కోటలో వెయ్యికి పైగా మొక్కలు నాటనున్నట్టు చెప్పారు.

కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్వీ రమణ, సూర్య, శ్రీనివాస్, ప్రసాద్, సీనియర్ సభ్యులు గుండు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు

# డిసిసిపి కోర్స్ వలన ఉజ్వల భవిష్యత్తు

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : డిప్లొమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీసు కోర్సు మూడు సంవత్సరాల కోర్సు వలన ఉజ్వల భవిష్యత్ ఉంటుందని భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పాలిసెట్ వ్రాసిన విద్యార్థులకు డిసిసిపి కోర్సు ఆప్షన్ పెట్టుకునేందుకు ఇది మంచి అవకాశం అనీ అన్నారు. ఈ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులుకు స్కాలర్ షిప్ ,హాస్టల్ సౌకర్యం ఉన్నట్లు తెలిపారు. అయితే ఇంటర్మీడియట్ సిఈసి గ్రూఫ్ లో చేరగోరు విద్యార్థులకు ఈ డిసిసిపి కోర్సు ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఈ కోర్సు యందు కామర్స్ తో పాటు ఎంఎస్ ఆఫీస్,ట్యాలీ,డి.టి.పి, మల్టీమీడియా, సి లాంగ్వేజ్ తదితర కంప్యూటర్ సబ్జెక్ట్,టైపురైటింగ్,షార్ట్ హ్యాండ్ సబ్జెక్టు లు కూడా బోధించబడతాయనీ అన్నారు. టైపు రైటింగ్ హయ్యర్ గ్రేడ్,షార్ట్ హ్యాండ్ లోయర్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సు లో పాసైన విద్యార్థులు బి.కాం రెండవ సంవత్సరం లో నేరుగా ప్రవేశం పొందవచ్చని చెప్పారు. ఎంఎండిసి ,ఎస్ హెచ్ ఎ ఆర్,ఎన్ ఆర్ ఎస్ సి వంటి ప్రభుత్వ రంగ సంస్థలలో అప్రెంటిషిప్ సౌకర్యం కల్పించడం జరుగుతుందనీ అన్నారు. అంతేకాకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు లో మంచి ఉద్యోగాలు పొందుతున్నట్లు చెప్పారు. డిసిసిపి కోర్సు చదువు కుని సిసిపి లో సీనియర్ లెక్చరర్ గా పనిచేస్తున్నారు. అదేవిధంగా



డిసిసిపి కోర్సు చదివిన పి చిట్టికాసులు తను చదువుకున్న కళాశాలలోనే లెక్చరర్ గా పనిచేస్తున్నారు. అంతేకాకుండా 2022 లో డిసిసిపి కోర్సు చదివి ప్రధమ స్ధానం సాధించిన మల్లిక ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నారు. అదేవిధంగా దివ్య కూడా ఈ కోర్సు చేసి హైకోర్టు లో అవకాశం సాధించారు.

# అభివృద్ధి పనులపై సమీక్ష



రాజాం (విజయభాను న్యూస్) : రాజాం పట్టణంతో పాటు మండలంలో అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలుతో పాటు అభివృద్ధి పనులుపై ప్రత్యేకాధికారి బి.సుధాకర్ శనివారం సమీక్ష నిర్వహించారు. రాజాం మండలపరిషత్ కార్యాలయంలో పలుశాఖల అధికారులతో మాట్లాడారు. అర్హులు అందరికీ పార్టీలకు అతీతంగా నవరత్నాలు అందాలని సూచించారు. ప్రతీ పంచాయతీలో అభివృద్ధి ప్రగతి కనబడాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సి పల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఏఈ రత్నాకర్, టీఎంసీ రత్నం, హౌసింగ్ ఏఈ రాజగోపాల్, ఎంపీడీఓ శంకరరావు, పీఆర్ జేఈ ప్రభాకరరావు, ఏపీఎం దదికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం..
# పలు రైళ్లు రద్దు
### - శ్రీకాకుళం రోడ్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు

శ్రీకాకుళం, విజయభాను న్యూస్) : ఒరిసా రాష్టం బాలాసోర్ వద్ద కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఆగిఉన్న గూడ్స్ రైలును ఢీకొంది. దీంతో శ్రీకాకుళం రోడ్ (ఆమదాల వలస) మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు కాగా, మరికొన్నింటిని రైల్వే అధికారులు దారి మళ్లించారు. ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో సహాయకేంద్రం ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 11.30 గంటలకు రావాల్సిన హౌరా-చెన్నై(12839) మెయిల్‌తో పాటు ఉదయం 10.10 గంటలకు రావాల్సిన హౌరా-యశ్వంత్‌పూర్ (12836) రైళ్లను రద్దు చేశారు. అస్సాం వెళ్లే గౌహతి (1259) ఎక్స్‌ప్రెస్, హౌరా నుంచి వాస్కోడిగామా (18047) వెళ్లే ఎక్స్‌ప్రెస్ విజయనగరం మీదుగా దారి మళ్లించారు. భువనేశ్వర్ నుంచి వచ్చే ఈస్టు కోస్టు కొంత ఆలస్యంగా నడిచింది. రైల్వే నెంబర్లు 85911, 85912, 85913, 85914తోపాటు 08942 286213, 08942 286245 ఫోన్ నెంబర్లులో ప్రయాణికులు సంప్రదించాలని కోరారు.

# క్షయ రోగులకు ఫుడ్ బాస్కెట్లు పంపిణీ



రాజాం (విజయభాను న్యూస్) : రాజాం నియోజక వర్గ పరిధిలో క్షయరోగులకు రాజాం ప్రాంతీయ ఆసుపత్రి రాజాంలో ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేశారు. అలోవెరా అనిమల్ హెల్త్ లిమిటెడ్ వీటిని అందించింది. రాజాం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి వి రాజ్యలక్ష్మి, సి ఎస్ ఆర్ ఎమ్ ఓ డాక్టర్ యం సి హెచ్ నాయుడు, సి ఎస్ డాక్టర్ హరిబాబు, సి ఎస్ డాక్టర్ కల్యాణ బాబు, టీబి యూనిట్ ఇన్చార్జి డాక్టర్ ఏ భార్గవ్, ఎస్ టి ఎస్ పివి ఎస్ క్రిష్ణారావు, యస్టి ఎల్ ఎస్ చిట్టిబాబు తదితరులు వీటిని రోగులకు అందజేశారు.

విజయభాను

## సంపాదకీయం

### విజ్ఞతతో వ్యవహరించాలి...

పొట్టకూటి కోసం ఉపాధి హామీ పనులు చేసే గ్రామీణ పేదలు, కౌలుదార్లు, రైతులతోబాటు ఉపాధ్యాయ, ఉద్యోగులు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండేట్టు చేస్తున్న మునిసిపల్ కార్మికులు... ఇలా వివిధ వర్గాలు, తరగతులకు చెందినవారు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనలు చేపట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర బిజెపి ప్రభుత్వం 'ఉపాధి హామీ' నిధులకు కత్తెర వేయడం, ఫేషియల్ అటెండెన్స్, యాప్‌లతోనే మస్టర్లు, వేసవిలో సైతం రెండు పూటల పని తదితర విషమ షరతులు విధించడంతో గ్రామీణ పేదలు అల్లాడుతున్నారు. వారికి కనీస వేతనం కూడా రావడంలేదు సరికదా నీడ, నీళ్లు వంటివి కూడా లభించడంలేదు. తమ ఇబ్బందులను సర్కారు దృష్టికి తెచ్చి సమస్యలను పరిష్కరించుకోవడానికి గత రెండు వారాలుగా రాష్ట్రమంతటా ఉపాధి కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి తొలుత ప్రకటించిన విధంగా జూన్ ఒకటో తేదీన రైతు భరోసా సొమ్ము తొలి విడత జమ చేస్తూ బటన్ నొక్కడం మంచిదే. ఇది ఖరీఫ్ వ్యవసాయ పెట్టుబడులకు కొంతమేర తోడ్పడుతుంది. అయితే గత ఖరీఫ్, రబీ ధాన్యం డబ్బు రానందున ఎంతోమంది రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వాస్తవ సాగుదార్లయిన కౌలు రైతుల కష్టాలు చెప్పనలవి కాదు. వారికి రైతు భరోసా రాదు, ఇ- క్రాప్ బుకింగ్ లేదంటూ పంటను ఆర్‌బికెల్లో కొనరు, బ్యాంకులు రుణాలివ్వవు... ఇలా ఎన్నో ఈతిబాధలు. రాష్ట్రంలో కౌలు చట్టసవరణ, వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 7 నుంచి జీపు యాత్ర, పాదయాత్రలకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం పిలుపునిచ్చింది. భూ యజమాని సంతకం వుంటేనే కౌలు అర్హత కార్డులు ఇస్తామని ప్రభుత్వం చట్టాన్ని మార్చడంతో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, విత్తన, ఎరువుల సబ్సిడీ, పంటనష్ట పరిహారం కౌలు రైతులకే ఇచ్చేలా చట్టసవరణ చేయాలని, కేరళ తరహా రుణవిముక్తి చట్టాన్ని రాష్ట్రంలో తీసుకురావాలన్న వారి ప్రధాన డిమాండ్లు ఎంతో న్యాయమైనవి.

పట్టణాలను పరిశుభ్రంగాను, సుందరంగానూ తీర్చిదిద్దడంలో అర్ధరాత్రి అపరాత్రి అనక కష్టం చేసే మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ఒక జాతా, శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి మరో జాతా బుధవారం ప్రారంభమయ్యాయి. సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు, గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నవి వారి ప్రధాన డిమాండ్లు. ఇవేవీ గొంతెమ్మ కోర్కెలు కాదు. పిఆర్‌సిలో ప్రారంభ వేతనం రూ.22 వేలుంటే, మున్సిపల్ కార్మికులకు రూ.15 వేలే చెల్లిస్తోంది. ఆప్కాస్‌లో కార్మికులందరినీ ఉద్యోగులుగా నమోదు చేశారు తప్ప, సౌకర్యాలు అమలు చేయడం లేదు. ఇంజనీరింగ్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ వారికిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ఎసరు పెట్టింది. కరోనా కాలంలో మున్సిపల్ వర్కర్లను ఫ్రంట్ లైన్ వర్కర్లుగా పేర్కొన్న ప్రభుత్వం విధి నిర్వహణలో మృతి చెందిన వారికి రూ.50 లక్షల పరిహారం చెల్లించకపోవడం దారుణం. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు, ప్రభుత్వ విధానాలను, సేవలనూ ప్రజలకు చేరవేసే ఉద్యోగులూ తమ సమస్యలను పరిష్కరించాలని ఆందోళనలు చేస్తున్నారు. ఫ్యాప్టో ఆధ్వర్యాన జూన్ 5 నుంచి సెప్టెంబరు 1 వరకు పలు రూపాల్లో ఉపాధ్యాయులు ఉద్యమించనున్నారు. విద్యారంగ సంస్కరణల పేరుతో ప్రభుత్వం వేలాది ఉపాధ్యాయ పోస్టులు తగ్గించడంతోపాటు పాఠశాలల విలీనం, బోధనేతర పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తోంది. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను పూర్తిగా మినహాయించాలి. ఆయా వర్గాలు, తరగతుల ప్రజానీకానికి సంబంధించిన న్యాయమైన కోర్కెలపై ఆందోళనలు చేస్తున్న వివిధ ప్రజా సంఘాలతో చర్చించి వాటిని పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత. సర్కారు విజ్ఞతతో వ్యవహరించాలి.

# పథకాల చేరువలో వలంటీర్ల పాత్ర కీలకం

- 'ఉత్తమ వాలంటీర్లకు - సేవా పురస్కారాల ప్రదానం
- స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆమదాలవలస, (విజయభాను న్యూస్) : పేదలకు సంక్షేమ పథకాలు అందజేయడంలో వాలంటీర్ల పాత్రే కీలకమని రాష్ట్ర శాసన సభా పతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. స్థానిక తాహసిల్దార్ కార్యాలయం వద్ద ఉత్తమ సేవలందించిన గ్రామ, సచివాలయాల వాలంటీర్ల సత్కార సభ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ మండలి పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లకు సేవారత్న సేవా వజ్ర సేవా మిత్ర పురస్కారాలతో సన్మానించారు ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ ప్రభుత్వానికి జవసత్వాలు, ఊపిరి వాలంటీర్లని పేర్కొన్నారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించిన వాలంటీర్లకు సేవా వజ్ర, సేవ రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేస్తుండటం సంతోషంగా ఉందన్నా రు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందించడంలో వాలంటీర్లు గురుతర బాధ్యత పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అందిస్తున్న వాలంటీర్లను అభినందించారు. కోవిడ్ సమయంలో మంచి సేవలం దించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కే వి జి సత్యనారాయణ, జడ్పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు బెవర కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు శివానంద బాబు, లావేటి అనిల్ కుమార్, పి ఎ సి ఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్, బీసీ సెల్ డైరెక్టర్ మూడడ్ల రమణ, ఎస్సీ సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, మండల మహిళా అధ్యక్షురాలు బొడ్డేపల్లి చామంతమ్మ, స్థానిక సర్పంచ్ వెంకట సూర్య చాందిని, స్థానిక ఎంపీటీసీ ఇల్లాకుల సూర్య ప్రకాష్ తదితర వైయస్సార్ పార్టీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు సచివాలయం సిబ్బంది అధికారులు వాలంటీర్లు పాల్గొన్నారు.

# హీరోయిన్‌ను చేయాలని.. కుమార్తెకు రోజూ సూది మందులు

- విజయనగరంలో ఓ మహిళ నిర్వాకం
- వద్దని వేడుకుంటున్నా వదలని వైనం - అనారోగ్యంపాలైన బాలిక
- అమ్మాయి ఫిర్యాదుతో దారుణం వెలుగులోకి..

విజయనగరం (విజయభాను న్యూస్) : సినీరంగం అంటే రంగుల ప్రపంచం.. కలల కదంబం.. దానిపై మోజుతో కుమార్తెను హీరోయిన్‌గా చేయాలనుకున్నదో తల్లి. అంతవరకు బాగానే ఉంది కానీ.. చెప్పుడు మాటలు విని.. అభంశుభం తెలియని చిన్నారిని 'త్వరగా పెద్దదాన్ని' చేయడం కోసం ఇంజెక్షన్లు ఇవ్వడం మొదలుపెట్టింది. బాధ భరించలేని బాధితురాలు చైల్డ్‌లైన్ విభాగానికి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. విజయనగరంలో చోటుచేసుకుందీ దారుణం. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర ఛైర్మన్ కేసలి అప్పారావు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఓ మహిళ (40) నివాసముంటోంది. ఓ కుమార్తె పుట్టాక ఆమె మొదటి భర్త చనిపోయాడు. దీంతో మరో వ్యక్తిని పెళ్లి చేసుకుంది. ఇద్దరు పిల్లలు జన్మించాక అతను ఆమెను వదిలిపెట్టి.. చిన్నారులను తీసుకుని వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఆమె ఇంకో వ్యక్తితో కలిసి ఉంటోంది. మొదటి భర్తకు పుట్టిన బాలిక (15) విశాఖలోని ప్రభుత్వ విద్యా సంస్థలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో తల్లి వద్దకు తరచూ ఎవరెవరో వస్తుండటాన్ని గమనించి అక్కడ ఉండేందుకు ఇష్టపడలేదు. ఈ విషయంలో తల్లితో గొడవపడేది. ఇటీవల ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి ఆ బాలికను చూశాడు. హీరోయిన్ అయ్యే



లక్షణాలు ఉన్నాయని, అయితే కొన్ని అవయవాలు బొద్దుగా పెరగాలంటూ నమ్మబలికాడు. అతడి సూచనల మేరకు కుమార్తెకు రోజూ ఏవేవో ఇంజెక్షన్లు ఇప్పించడం ప్రారంభించింది. ఈ క్రమంలో ఆ చిన్నారి అనారోగ్యం బారిన పడింది. బాధ భరించలేక.. తల్లిని వేడుకున్నా విడిచిపెట్టలేదు. దీంతో ఏం చేయాలో తోచక చివరకు గురువారం రాత్రి 1098కు ఫోన్ చేసి చైల్డ్‌లైన్ సిబ్బందికి తన దీనస్థితిని వివరించింది. వారు వెంటనే అప్రమత్తమై జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసుల సహకారంతో వెళ్లి బాలికను తమ అధీనంలోకి తీసుకున్నారు. అనంతరం విశాఖపట్నంలో స్వధార్ హోమ్‌కు పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయాలని దిశ పోలీసులను కోరినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు.

## కవి సమయం

### పరిశుభ్ర ధరిత్రి

ఆరోగ్యమే మహా భాగ్యం అన్నది ఆర్యోక్తి
బలవర్ధక ఆహారం చక్కని పరిసరాలు చల్లని గాలి ,
కల్మాష రహిత మనస్సు ఆరోగ్య హేతువు
శుచి శుభ్రత దైనందిన జీవితం లో అవసరాలు
పరిశుభ్రత నెలకొన్న చోత దైవత్వం వెల్లివిరుస్తుంది
మనసుకు పట్టిన మకిలి ,సంకుచితత్వం ప్రక్షళనతో
కాలుష్య రహిత సమాజం సాధ్యం
పరిశుభ్రమైన ఈల్లు లక్ష్మీదేవికి ఆవాసం
స్వచ్ఛత సాధనయే మన లక్ష్యం కావాలి
పంచ భూతాల్లో ఒకతైన ధరిత్రి
మన ఉనికికి ఆధారం
పవిత్ర భూమిని పరిషుద్ధం గా
తీర్చిదిద్దదమే మనందరి నైతిక బాధ్యత, కర్తవ్యం

కవిత రచన :
సి. ప్రతాప్

## పంచాంగం

చతుర్ధశి ఉ. 10.16 విశాఖ ఉ.5.33
అనురాధ రా.తె.5.18 వ.ఉ.9.30ల 11.05

ఆదివారం
03-06-2023

a **మేషం** : ప్రముఖుల సహాయంతో ఒక సమస్య నుంచి క్షేమంగా బయట పడతారు. ఖర్చులు, చెల్లింపులు ప్రయోజనకరంగా ఉంటాయి. ఇతరుల విషయా లకు దూరంగా ఉండటం క్షేమదాయకం. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరుతుంది. స్త్రీలు గృహాలంకరణ, విలాస వస్తువుల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. b **వృషభం** :పారిశ్రామిక రంగాల వారికి కార్మికులతో సత్సంబంధాలు నెలకొంటాయి. క్యాటరింగ్ పనివారలు, చేతివృత్తుల వారికి ఆశాజనకం. తరచూ వేడుకలు, శుభకార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల చోటు చేసుకుంటాయి. c **మిథునం** : మీ యత్నాలు కొంత ఆలస్యంగానైనా పరిపూర్ణంగా పూర్తవుతాయి. నూతన పెట్టుబడులు, వ్యాపారాలకు అనుకూలం. చేపట్టిన పనుల్లో శ్రమాధిక్యత, ప్రయాసలు ఎదుర్కొంటారు. స్త్రీలకు బంధువుల వైఖరి నిరుత్సాహం కలిగిస్తుంది. అవివాహితులు శుభవార్తలు అందుకుంటారు. బంధువులతో మనస్పర్థలు తలెత్తుతాయి. d **కర్కాటకం** : వస్త్ర, బంగారం, వెండి, ఫ్యాన్సీ వ్యాపారులకు పురోభివృద్ధి. మిత్రుల సహకారంతో కొత్త యత్నాలు మొదలెడతారు. ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగస్తులు పై అధికారులను మెప్పిస్తారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అనుకూలిస్తాయి. స్పెక్యులేషన్ రంగాల వారికి నిరుత్సాహం తప్పదు. e **సింహం** :నిరుద్యోగులు, చేతి వృత్తుల వారికి ఆశాజనకం. వేడుకలు, శుభకార్యాల్లో అందరినీ ఆకట్టుకుంటారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. పారిశ్రామిక రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఆర్థిక లావాదేవీలు సామాన్యంగా ఉంటాయి. f **కన్య** :ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపారాలకు కొత్త కొత్త పథకాలు, ప్రణాళికలు రూపొందిస్తారు. దంపతుల మధ్య పలు ఆలోచనలు చోటు చేసుకుంటాయి. ధన వ్యయంలో ఏకాగ్రత వహించండి. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. ఎదురు చూడకుండానే మీకు కొత్త అవకాశాలు లభిస్తాయి. g **తుల** : ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచివి కాదని గమనించండి. వస్త్ర, ఫ్యాన్సీ, మందులు, రసాయన సుగంధ ద్రవ్య వ్యాపారులకు పురోభివృద్ధి. కోర్టు వ్యవహారాలలో ప్లీడరు, ప్లీడరు గుమస్తాలకు ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఖర్చులు అధికమవుతాయి. h **వృశ్చికం** :ఆలయాలను సందర్శిస్తారు. బంధువులతో తెగిపోయిన సంబంధాలు బలపడతాయి. ఆత్మీయుల కలయిక సంతోషం కలిగిస్తుంది. వ్యాపారాభివృద్ధికై చేయు కృషిలో రాణిస్తారు. రావలసిన ధనం అందటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. మీ కార్యక్రమాలు, పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. i **ధనుస్సు** :వ్యాపారాల విస్తరణలు, పరిశ్రమల స్థాపనలకు కావలసిన అనుమతులు మంజూరు కాగలవు. ఒక వ్యవహారం నిమిత్తం న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతారు. గృహంలో ఒక శుభకార్యానికి అనువైన పరిస్థితులు నెలకొంటాయి. మీ విలువైన వస్తువులు, పత్రాల విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. j **మకరం** :స్త్రీలకు బంధువుల రాక వల్ల ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి. పత్రిక, ప్రైవేటు సంస్థల్లోని వారికి యాజమాన్యం తీరు ఆందోళన కలిగిస్తుంది. చేతివృత్తులు, క్యాటరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. ఏజెన్సీ, నూతన కాంట్రాక్టుల విషయంలో పునరాలోచన అవసరం. గృహ నిర్మాణాలు, మరమ్మతులు అనుకూలిస్తాయి. k **కుంభం** :తలచిన పనుల్లో జయం లాంటి శుభ సూచకాలున్నాయి. ఎంత ధనం వెచ్చించినా కోరుకున్న వస్తువు దక్కించుకుంటారు. స్త్రీలకు నూతన పరిచయాలు, చుట్టుప్రక్కల వారి నుంచి ఆహ్వానాలు అందుతాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. ఒక వ్యవహారం అనుకోకుండా మీకు అనుకూలిస్తుంది. L **మీనం** :ఆడిటర్లు, అకౌంట్స్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికం. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో లౌక్యం అవసరం. నూతన పెట్టుబడులు, లీజు, ఏజెన్సీలు లాభిస్తాయి.



# సువర్ణముఖీ నదీ తీరమున వెలసిన శ్రీకాళహస్తీశ్వరుడు

సువర్ణముఖీ నదీ తీరమున వెలసిన ఈ స్వామి శ్రీకాళహస్తీశ్వరుడు. స్వయంభువు లింగము, లింగమునకెదురుగా వున్న దీపము లింగము నుండి వచ్చు గాలికి రెపరెపలాడును. శ్రీకాళహస్తిని దక్షిణ కాశీ అని అంటారు. ఇక్కడి అమ్మవారు జ్ఞానప్రసూనాంబ, అంబాత్రయములలో ఒకరు. శివలింగము ఇక్కడ వర్తులాకారము వలె గాక చతురస్రముగ వుంటుంది. ఇది కార్తీకమాసంలో తప్పక సందర్శించవలసిన క్షేత్రం...

స్థల పురాణాల ప్రకారం ఇది బ్రహ్మకు జ్ఞానమును ప్రసాదించిన ప్రదేశం. వశిష్ఠుడు, సాలెపురుగు, పాము, ఏనుగు, బోయడు అయిన తిన్నడు (కన్నప్ప), వేశ్య కన్యలు, యాదవ రాజు, శ్రీ కాళహస్తీశ్వర మాహాత్మ్యం వ్రాసిన దూర్జటి) వంటి వారి కథలు ఈ క్షేత్ర మహాత్మ్యంతో పెనవేసుకొని ఉన్నాయి.

కన్నప్ప అనే వేటగాడు నిత్యం స్వామిని కొలుస్తుండేవాడు . అతని భక్తిని పరీక్షించడానికి స్వామి ఒకరోజు తన కంటినుండి నెత్తురు కార్చేడట. వెం టనే కన్నప్ప తన కన్ను పీకి స్వామి కంటికి అమర్చాడట. అప్పుడు స్వామి రెండవకంటి నుండి కూడ నెత్తురు కారటం మొదలయింది. భక్తుడె%న కన్నప్ప సందేహించకుండా తన రెండవకన్ను కూడా పీకి స్వామికి అమ ర్చాడు. స్వామి ప్రత్యక్షమె% భక్తుడె%న కన్నప్పని కరుణించి ముక్తి ప్రసాదిం చాడు. ఈ దేవాలయము చాలా పెద్దది, పై కప్పుపై రంగులతో చిత్రించిన అనేకములయిన చిత్రములు వున్నాయి. మణికుండేశ్వరాఖ్య అనే మంది రమువున్నది. కాశీ క్షేత్రములో వలె ఇక్కడ చనిపోయే వారికి పరమశివుడు ఓంకార మంత్రమును, తారక మంత్రమును ఉపదేశించి మోక్షము ఇచ్చునని భక్తుల నమ్మకము. పాతాళ విఘ్నేశ్వరాలయం: దేవాలయ ప్రాంతము లోనే పాతాళ విఘ్నేశ్వరాలయము కలదు. దేవాలయమునకు సమీప ములోగల కొండపై భక్త కన్నప్పకి చిన్న ఆలయము నిర్మించారు. శ్రీకాళహస్తీశ్వరాలయము రాజగోపురము యొక్క సింహద్వా రము దక్షిణాభిముఖము. స్వామి వారు ఉత్తరాభిముఖులె% వుంటారు. ఆదిశంకరులు ఇక్కడ శ్రీ చక్రము స్థాపించారు. ఈ క్షేత్రమునకు గల ఇతర నామములు దక్షిణకె%లాసమనియు, సత్య మహా భాస్కరక్షేత్రమనియు, సద్యోముక్తిక్షేత్రమనియు, శివానం దైక నిలయమనియు పేర్కొనటం జరిగింది. మహా శివరాత్రినాడు ఇక్కడ బ్రహ్మాండమైన ఉత్సవం జరుగుతుంది.నాలుగు దిక్కుల దేవుళ్ళు: గుడి గర్భాలయంలోని శ్రీకాళ హస్తీ శ్వర, జ్ఞాన ప్రసూనాంబ విగ్రహాలు. శ్రీకాళహస్తీశ్వర ఆలయం నిర్మాణంలో ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ వినాయ కుడు, శ్రీకాళహస్తీ శ్వరుడు, జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు, దక్షిణా మూర్తి ఒక్కొక్కరు ఒక్కొక్క దిక్కునకు అభిముఖులె% ఉన్నారు. ఆలయ దర్శనం ద్వారా చతుర్విధ పురుషార్థ సిద్ధి లభిస్తుందనడానికి ఇది సూచన అని భక్తుల విశ్వాసం. పాతాళ

## సంకీర్తన

గణపతి ఉత్తరాభి ముఖునిగాను, జ్ఞాన ప్రసూనాంబ తూర్పు ముఖం గాను, కాళ హస్తీశ్వరుడు పశ్చిమ ముఖంగాను దక్షిణామూర్తి దక్షిణ ముఖం (మహా ద్వారం ఎదురు)గాను ఉన్నారు. కాళహస్తిలోని శివలింగం పంచ లింగాలలో వాయులింగంగా ప్రసిద్ధి చెందింది. (కంచి ఏకాంబరేశ్వరుడు పృథ్వీలిం గము, శ్రీరంగం వద్ద జంబుకేశ్వరుడు జలలిం గము, అరుణాచలంలో తేజోలింగము, చిదం బరంలో ఆకాశలింగము). స్వామి వాయుతత్వ రూపానికి నిదర్శనంగా గర్భగుడిలోని కుడివైపున ఉన్న రెండు దీపాలు ఎప్పుడూ చలిస్తూ ఉంటా యని చెబుతారు. రాహు కేతు క్షేత్రమని ప్రసిద్ధి పొందింది. పుత్ర శోకానికి గురైన వశిష్ట మహర్షికి పరమేశ్వరుడు పంచ ముఖ నాగలింగేశ్వరునిగా దర్శన మిచ్చాడట. ఈ నాగరూపమునే బ్రహ్మ దేవుడు కూడా అర్చించాడట. ఈ నాగరూపం కారణంగా ఈ క్షేత్రానికి రాహు కేతు క్షేత్రము అని పేరు వచ్చింది. సర్ప దోషము, రాహు కేతు గ్రహ దోషాలనుండి నివారణ కోసం ఈ స్వామిని పూజిస్తారు.

# రైలు ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన మాజీ మంత్రి కోండ్రు



రాజాం (విజయభాను న్యూస్) : ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో జరిగిన రైలు ప్రమాద ఘటనపై మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ శనివారం నాడు పత్రికా ప్రకటన విడుదల చేశారు,ఈ ఘటనలో 288 మంది మృతి చెంది 900 మంది వరకు గాయపడటం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు,మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు, గాయ పడ్డవారు త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు, బాధితులకు మెరుగైన వైద్యం అందిం చాలన్నారు, ఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని కోరారు,మృతులు, క్షత గాత్రుల్లో రాష్ట్రానికి చెందిన వ్యక్తులు ఎవరైనా ఉంటే ఏపీ ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు,

రైళ్లు ఢీ కొన్న ఘటనతో వందలాది కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపిందని వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నామన్నారు,ఇలాంటి విపత్కర పరిస్థితిలో గాయపడిన వారికి రక్తం అందిం చేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చి, మానవతా దృక్పథం తో వందలాదిమంది యువకులు సమీప ఆసుపత్రులకు వచ్చి రక్తాన్ని అందించి ప్రానదాతలుగా నిలవడం స్ఫూర్తిదాయకం అన్నారు,ప్రమాదం జరిగిన ప్రదేశానికి ముందుగా చేరుకుని సహాయక చర్యలను అంద జేసిన చుట్టుప్రక్కల గ్రామాల నివాసి తులకు కోండ్రు కృతజ్ఞతలు తెలిపారు,మృతుల కుటుం బాలకు కేంద్రం 15 లక్షలు, తీవ్ర గాయాలైన వారికి 4 లక్షలు, స్వల్పంగా గాయ పడిన వారికి లక్షరూపాయలు చొప్పున పరిహారం అందజేయాలని మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మృతిచెందిన క్షతగాత్రుల కుటుం బాలకు ఆరులక్షల ఎక్స్ గ్రేషియో అందజేసి మానవత్వాన్ని చాటుకొని కావాలని డిమాండ్ చేశారు.

# గ్రామీణ వైద్యుల చట్టబద్ధతకు

## టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును కలసిన బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్

**- టీడీడీ జాతీయ అధ్యక్షుడు నారా.చంద్రబాబు నాయుడు కు వినతి పత్రం అందజేస్తున్న బిఎంపిడబ్ల్యుఏ ఏపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరికి శ్రీనివాస్**

**- ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పిస్తాం - టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు.**



గుంటూరు (విజయభాను న్యూస్) :గ్రామీణ వైద్యుల గుర్తింపు కొరకై టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి ఆదిరెడ్డి.అప్పారావు సహకారముతో శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరి టీడీపీ కార్యాలయం నందు బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరికి.శ్రీనివాస్ టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు ను కలసి గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ గ్రామీణ వైద్యులకు చట్ట బద్ధత కల్పించాలని ఒక వినతి పత్రాన్ని సమర్పిస్తూ గతంలో మాజీ ముఖ్యమంత్రి కీ.శే.వైయస్ రాజశేఖర్ రెడ్డి గ్రామీణ వైద్యుల చట్టబద్ధతకు 429 జీవో ను ఏర్పాటు చేసి దాని ద్వారా గ్రామీణ వైద్యులకు కమ్యూనిటీ పారామెడిక్స్ శిక్షణ ను అందిచారని అయితే అది అర్ధాంతరంగా నిలిచిపోయిన సందర్భంలో మీరు ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో గ్రామీణ వైద్యుల చట్టబద్ధతకు 2017 ఆగష్టు 22వ తేదీన 465 జీవో ను తీసుకొచ్చారని అయితే అది అమలు కాలేదని గుర్తు చేసారు.దీనిపై టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా.చంద్రబాబు నాయుడు స్పందిస్తూ పల్లెల్లో గ్రామీణ వైద్యుల ఆవస్యకత ఎంతైనా ఉందని 2024 లో టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే గ్రామీణ వైద్యుల చట్ట బద్ధతకు మేనిఫెస్టో లో పొందుపరచి ప్రభుత్వ గుర్తింపు కల్పిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా బిఎంపిడబ్ల్యుఏ ఏపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరికి.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల చట్టబద్ధతకు గుర్తింపు కొరకు స్పందించిన మాజీ ముఖ్యమంత్రి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా.చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా.చంద్రబాబు నాయకుడు ను కలిసేందుకు అవకాశం కల్పించిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి.అప్పారావు కు ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఎంపిడబ్ల్యు ఏ ఏపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వై.సత్యనారాయణ మూర్తి,తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళీధర్,ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్,కోశాధికారి హెచ్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయేది తెలుగుదేశం పార్టీయే - మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్



అనంతగిరి, విజయభాను న్యూస్ : అరకు నియోజకవర్గం అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ మాజీ ఎంపీటీసీ కోర్రా కొండమ్మ భర్త కొర్ర రమణ సంస్మరణ దినం దినకార్యం సందర్భంగా తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గం ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొవడం జరిగింది అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్టంలో తెలుగుదేశం పార్టీ మహానాడు జరిగిన అనంతరం తెలుగుదేశం పార్టీలో నూతనోత్సాహం మొదలైందని మహానాడులో విడుదల చేసిన మినీ మేనిపెస్టో ప్రజలందరికి ఉపయోకరంగా ఉందని మహిళలకు 18సం నుండి మహిళలకు ఊతం ఇచ్చేలా ఉందని వైసీపీ ప్రభుత్వ పతనం మొదలైందనీ రాబోయే ఎన్నికలో తెలుగుదేశం పార్టీ గెలుపుకు ప్రజలందరు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి కిడారి శ్రవణ్ కుమార్ అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బుజ్జి బాబు, మాజీ జిల్లా వైస్ చైర్మన్ కొట్యాడ అప్పారావు,ప్రధాన కార్యదర్శి ఆనంద్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణ రాజు,రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు,టీడీపీ డివిజన్ నాయకులు పాంగి పాండురంగ స్వామి, అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నెగెలా సుందర్ రావు,అరకు పార్లమెంట్ టీ ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షులు తామర్ల సత్యనారాయణ,వార్డు మెంబర్ లచ్చన్న,లాయర్ రత్నంరాజు,టీడీపీ సీనియర్ నాయకులు బిడ్డ లక్ష్మణ్, బాక నగేష్,శ్యామ్,,మహిళా నాయకులు కళావతి,నీరజ లక్ష్మి, విజయ,తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ఐటీడీపీ కమిటీ సభ్యులతో కోరాడ రాజబాబు సమావేశం



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : స్థానిక టి డి పి కార్యాలయంలో భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోరాడ రాజబాబు అధ్యక్షతన భీమిలి నియోజకవర్గం ఐటిడిపి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజబాబు ఐటిడిపి సభ్యులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం,హౌస్ మ్యాపింగ్, మై టిడిపి యాప్ లో లాగిన్ కొరకు సరియైన ప్రణాళికను ఇచ్చి చేయవలసిన కార్యచరణ పై వివరించారు. ఈకార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఐటిడిపి అధ్యక్షులు మరుపిళ్ళ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు జెపి రాజు,కోరాడ వెంకట్రావు,కోరాడ యల్లాజి,కోరాడ శంకర్రావు, మొకర రవి, బుజ్జి పాల్గొన్నారు.

# లోకేశ్‌పై కోడిగుడ్ల దాడి పిరికి చర్య



సాలూరు విజయభాను న్యూస్ : లోకేశ్ యువగళం పాదయాత్రతో వైకాపా నేతల్లో వణుకు పుడుతోందని, కోడిగుడ్ల దాడితో పిరికి చర్యకు పాల్పడ్డారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆమె నివాసంలో నాయకులతో సమావేశ మయ్యారు. వైకాపా నేతలు చిల్లర వేషాలు మానుకోవాలని, తెదేపా శ్రేణులు తిరగబడితే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిం చారు. అధికారం వైకాపాకు శాశ్వతం కాదని, తెదేపా అధికారంలోకి వస్తే వడ్డీతో సహా చెల్లి స్తామని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రతను తొలగిస్తే ఫినిష్ అని స్పీకర్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. సీఎం సొంత జిల్లాలో వైకాపా కనుమరుగ వుతుంటే మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తు న్నారని తెలిపారు. యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజా స్పందనను చూసి ఓర్వలేక పోతున్నారని, లోకేశ్ పాదయాత్రకు భద్రత పెంచాలని డిమాండ్ చేశారు.

# అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ సర్వీసులు



అరసవిల్లి, : విజయభాను న్యూస్ :అరుణాచల గిరి ప్రదక్షిణకు శ్రీకాకుళం నుంచి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం బయలుదేరిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును జెండా ఊపి ప్రారం భించారు. నాలుగు రోజుల పాటు విహార యాత్ర ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. రెండో రోజు కాణిపాకంలో వరసిద్ధి వినాయక స్వామి దర్శనం, అనంతరం శ్రీపురంలో గోల్డెన్ టెంపుల్, అక్కడ నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు చేరుకునేలా సర్వీసు ఉంటుందని వివరించారు. ఆ తర్వాత శ్రీకాళహస్తి క్షేత్రం చూసుకుని శ్రీకాకుళం బస్సు చేరుకుంటుందని స్పష్టం చేశారు. నాలుగు రోజుల బస్సులో యాత్రకుగాను ఒకరికి రూ.4500 టిక్కెట్ వసూలు చేసినట్టు చెప్పారు. జూలై 30వరకు ఈ సర్వీసులు ఉంటాయని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని తెలిపారు.

# పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే దిశగా వైసీపీ ప్రభుత్వం

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : ప్రాధమిక, ప్రాధమికోన్నత పాఠశాల విద్యను నిర్వీర్యం చేసి, విద్యార్థుల భవితవ్యంతో ఆట్లాడేవిధంగా విద్యాశాఖ నిర్ణయాలు ఉన్నాయని టి డి పి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు ఉన్న పాఠశాలలను ప్రాధమి కోన్నత పాఠశాలలుగా పరిగనిస్తారని అన్నారు. అందులో 3 నుండి 8వ తరగతి వరకు విద్యార్థులు 99 మంది కంటే తక్కువ ఉంటే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను వేరే పాఠశాలకు బదిలీ చేయాలని విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం సరైనది కాదని అన్నారు. యూపి స్కూల్లో 6,7,8 తరగతులు కూడా ఉంటాయని వీరికి సబ్జెక్ట్ పరంగా ఉపాధ్యా యులు పాఠాలను బోదించాల్సి వస్తుందని అన్నారు. ఒక ప్రాధమికోన్నత పాఠశాలలో 4 నుండి 5 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు లేక ముగ్గురు ఎస్ జి టి లు ఉంటారని అన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎసరు పెట్టడమే ప్రభుత్వ లక్ష్యమా విద్యార్థుల భవితవ్యంతో విద్యాశాఖకు సంబంధం లేదా అని ఘాటుగా ప్రశ్నించారు. ఇప్పుడు విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయం ప్రకారం 99 మంది విద్యార్డులు కంటే తక్కువ ఉన్న పాఠశాలలు ఉమ్మడి విశాఖ జిల్లాలో 52 ఉన్నాయని, ఒక్క విశాఖ జిల్లాలోనే 24 పాఠశాలలు ఉన్నాయని అన్నారు. 3,4,5 తరగతుల విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్ లతో బోధించాలన్న ఉద్దేశ్యంతో హై స్కూల్లో విలీనం చేసిన విద్యాశాఖకు 7,8,9 తరగతుల విద్యార్థులకు ఎస్ జీ టిలతో బోధించాలన్న ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారా అని అన్నారు. స్కూల్ అసిస్టెంట్ లను తగ్గించాలనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వ నిర్ణయాలు ఉండ కూడదని, విద్యార్థుల భవిష్యత్ ముఖ్యమని అన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం




ములగాడ (విజయభాను న్యూస్ ): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర రక్షణ శాఖ ఆదేశాల మేరకు హిందూస్తాన్ షిప్ యార్డ్ ఆధ్వర్యంలో మే 20 నుండి జూన్ 5 వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9గంటలకు షిప్ యార్డ్ ముఖాద్వారం నుండి మల్కాపురం పోలీస్ స్టేషన్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిధి గా విచ్చేసిన డైరెక్టర్ కార్పొరేట్ & ప్లానింగ్ జె పి గుప్తా జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తూ...

వారంలో ఒక్కరోజైనా సైకిల్ ఉపయోగించి విధులకు హాజరు కావాలని కోరారు.

ఈ కార్యక్రమం లో...

షిప్ యార్డ్ ఉన్నతధి కారులు, గుర్తింపు యూనియన్ నాయకులు, ఉద్యోగులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# భీమిలీ సీహెచ్‌సి సెంటర్

## సూపరిండెంట్ గా డాక్టర్ ఎం.ఫణి కుమార్



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : స్థానిక సీ హెచ్ సి సెంటర్ కొత్త సూపరిండెంట్ గా డాక్టర్ ఎం. ఫణి కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు విధులు నిర్వహించిన సూపరిండెంట్ డాక్టర్ కనకదుర్గ రిటర్మెంట్ అవ్వడంతో ఆమె స్థానంలో డాక్టర్ ఎం. ఫణి కుమార్ బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవిజ్ఞులైన వైద్యులతో పాటు వివిధ రకాల సేవలు అందిస్తున్న సిహెచ్‌సి ని పేదవర్గాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# జాతీయ ఈత పోటీలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థి ఎంపిక



పరవాడ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 12 వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి ఈత పోటీలకు పరవాడ మండలం పి. భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ చెందిన 12వ తరగతి విద్యార్థి ఎస్.నిఖిల్ ప్రకాష్ ఎంపికయ్యాడు. ఈయన తిరుపతిలోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జనవరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 400 మీటర్ల ఫ్రీ- స్టైల్, 200 మీటర్ల బట్టర్ ఫ్లై,ఈత పోటీల్లో రజిత పతకం సాధించి అండర్-19 విభాగంల జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ ఎన్.సీతాలక్ష్మి వెల్లడించారు.గత కొంత కాలంగా పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ మరియు స్విమ్మింగ్ కోచ్ జి. మధుబాబు దగ్గర తర్ఫీదు పొందుతున్న ఈ విద్యార్థి ఆటలు తో పాటు గాయకుడుగా చదువులో కూడా రానిస్తూ అందరి మన్ననలు పొందుతున్నడు. ఈ విద్యార్థి ప్రతిభ కు మెచ్చి పాఠ శాల చైర్మన్ పి.సూర్య నారాయణరెడ్డి 5000/- రూపాయలు నగదు బహుమతి ని అందజేయాగ సీఈవో నిశాంత్, కోచ్లు హరినాథ్ రెడ్డి, బషీర్, కోర్డినేటర్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు. జాతీయ పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

# వరుస దొంగతనాలు చేస్తున్న ముద్దాయి అరెస్టు

- సుమారు 87 గ్రాముల బంగారం,852 గ్రాముల వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన పెద్దాపురం డిఎస్పీ లలితా కుమారి



అన్నవరం (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం గ్రామంలో గత సంవత్సరం ఆగష్టు నెలలో అన్నవరం గ్రామం లో నివాసం ఉంటున్న ఆదిరెడ్డి. లక్ష్మి ఇంట్లో దొంగతనం జరిగి ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన సుమారు 28 గ్రాముల బంగారు వస్తువులు మరియు 317 గ్రాముల వెండి వస్తువులు పోయినవని,అదే విదంగా గత సంవత్సరం నవంబరు నెలలో అన్నవరం గ్రామం లో నివాసం ఉంటున్న పరుపురెడ్డి.సోంబాబు వారి ఇంట్లో దొంగతనం జరిగి, ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన సుమారు 24 గ్రాముల బంగారు వస్తువులు మరియు 960 గ్రాముల వెండి వస్తువులు పోయినవని,అదేవిదంగా గత సంవత్సరం డిసెంబర్ నెలలో, అన్నవరం గ్రామం లో నివాసం ఉంటున్న ఏనుగుపల్లి.శ్రీదేవి ఇంట్లో దొంగతనం జరిగి ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన సుమారు 8 గ్రాముల బంగారు గొలుసు పోయినవని సంబంధిత వ్యక్తుల ఫిర్యాది మేరకు, అన్నవరం పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు చేసారు. దీనిపై అన్నవరం పోలీసులు ముమ్మరంగా సోదించారు.దీనిపై అన్నవరం అదనపు ఎస్సై బి.అజయ్ బాబు మరియు సిబ్బంది అయిన హెడ్ కానిస్టేబుల్ రాంబాబు మరియు డ్రైవర్ లోవరాజు ల సహాయం తో ముద్దాయి అయిన మనీష్ కుమార్ సింగ్ %హా/హా% అరవింద్ సింగ్,వయసు 36 సంవత్సరములు,కులం క్షత్రియ, వేలంపేట కాలనీ,రామాలయం స్ట్రీట్,తుని ను చాక చక్యంతో ది.02.06.2023 తేది న పట్టుకొని అతని వద్ద నుండి పై మూడు కేసులలో చోరీ సొత్తు తో పాటు,వేరే పోలీస్ స్టేషన్ ల యొక్క రెండు కేసులలో చోరి సొత్తు ను అనగా మొత్తం అయిదు కేసులలో సుమారు 87 గ్రాముల బంగారం మరియు 852 గ్రాముల వెండి అతని వద్ద నుండి స్వాధీన పరుచుకొన్నారని పెద్దాపురం డిఎస్పీ లలితా కుమారి తెలిపారు.అంతట అరెస్టు చేసిన ముద్దాయి అయిన మనీష్ కుమార్ సింగ్ ను ప్రతిపాడు కోర్టు నందు హాజరు పరుస్తున్నట్లు ప్రత్తిపాడు సిఐ కిషోర్ బాబు తెలిపారు.

# ఘనంగా ఎమ్ ఎస్ ఎమ్ ఇ డైరక్టర్ శీలం నధియా జన్మదిన వేడుకులు

## నధియాకు హార్ధిక శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, ఎమ్మెల్యే,



పరవాడ (విజయభాను న్యూస్) : రాష్ట్ర ఎమ్ ఎస్ ఎమ్ ఇ డైరక్టర్ శీలం నధియా జన్మదిన వేడుకులు పరవాడ వైసిపి కార్యలయంలో అంగరంఘ వైభవంగా జరిగాయి. ముందుగా ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనువాస్ ,జడ్పిటిసి పియస్ రాజు సారధ్యంలో శీలం నధియా జన్మదిన వేడుకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.. .ముందుగా మంత్రి గుడివాడ అమర్ నాధ్ ,ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచి దుశాలువాతో ఘనంగా సత్కరించారు..అనంతరము పరవాడ ఎంపిపి పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనువాస్ ,జడ్పిటిసి పియస్ రాజు , వైసిపి మండలపార్టి ప్రెసిడెంట్ కోనరామారావు,పరవాద సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు తథితర్లు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియపరిచారు.. అనంతరము పలువురు వక్తలు మాట్లడుతూ చిన్నతనం నుండి రాజకీయాన్ని నమ్మికోని అంచులు అంచులుగా ఎదుగుతూ రాష్ట్ర ఎమ్ ఎస్ ఎమ్ ఇ డైరక్టర్ పదవి వరించడము ఎంతో అభినందించదగ్గ విషయమనీ కొనియాడారు..ఈమె ఇటువంటి జన్మదిన వేడుకులు మరిన్ని జరిపికోవాలానీ మనస్పూర్తిగా కొరుకుంటూ రానున్నరోజుల్లో మరిన్నీ ఉన్నతపదవులు అవరోధించాలాని పలువురు అకాక్షించారు.. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న చినజీయర్ స్వామి

గరివిడి (విజయభాను న్యూస్) : గరివిడి బంగారమ్మ కాలనీలో బమ్మిడి అప్పలస్వామి, కృష్ణమ్మ దంపతుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో సుమారు రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి, గోదాదేవి, భగవద్రామానుజాచార్యుల ఆల యంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం వేదగురువు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి ప్రత్యేక పూజలు చేశారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పూజల్లో పాల్గొన్నారు. బొత్స దంపతులు చిన్నజీయర్ స్వామికి చిత్రపటాన్ని బహూకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉదయం విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణా హుతితో ప్రతిష్ఠ కార్య క్రమం ముగుస్తుందని ఆలయ ధర్మకర్త అప్పలస్వామి తెలిపారు.

## ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ

కాకినాడ,(విజయభాను న్యూస్) : ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమైన నేపథ్యంలో శనివారం కాకినాడ జేఎన్టీయూ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ బ్లాక్ లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టరు డా. కృతికాశుక్లా అదనపు ఎస్పీ పీ.శ్రీనివాసు, రెవిన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వాహణ, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టరు కృతికా శుక్లా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# మెగా జాబ్‌మేళాకు స్పందన




శ్రీకాకుళం, (విజయభాను న్యూస్) : రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ ఆధ్వర్యం లో నిరుద్యోగ యువ తకు ఉద్యోగ కల్పనలో భాగంగా శ్రీకాకుళం అసెంబ్లీ నియోజక వార్గనికి సంబంధించి స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 15 ప్రైవే ట్ సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించా రు. 533 మంది హాజరు కాగా 209 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ డీవీ విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగపర్చుకోవాలన్నారు. జిల్లా నైపుణ్యా భివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ మాట్లా డుతూ.. ఇంటర్వ్యూకు హజరై ఎంపికవ్వని అభ్యర్థులు స్కిల్ హబ్స్ ట్రైనింగ్‌లో చేరి నైపుణ్యాలను పెంచుకుని, మళ్లీ జాబ్ మేళలో పాల్గొని విజయం సాధించాలన్నారు. కార్యక్ర మానికి జిల్లా ఉపాధి అధికారి సుధ, అర్ట్స్ కళా శాల ప్రిన్సిపాల్ సురేఖవాణి, సెట్‌శ్రీ సీఈవో ప్రసాద రావు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణ రావు, ఎస్ఈబీ సీఐ, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



ములగాడ (విజయభాను న్యూస్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని ప్రముఖ కార్మిక నాయకుడు బి. సత్యానందం అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంధాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆయన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పిలుపుమేరకు ప్రతి మొదటి శనివారం గ్రంధాలయాల్లో "మనం- మన గ్రంథాలయం" అనే కార్యక్రమంలో స్వచ్ఛందంగా ప్రజలు పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొంటున్నారని, శనివారం ఈ కార్యక్రమంలో బాలలు పాల్గొనడం అదృష్టం అని అన్నారు. కార్యక్రమానికి ప్రముఖ కవి కె.సత్తిరాజు అధ్యక్షత వహించారు. అనంతరం చిన్నారులు, స్థానిక యువజనలు కలిసి గ్రంథాలయాన్ని, గ్రంథాలను శుభ్రం చేశారు. దీంతో గ్రంథాలయం కళకళలాడింది. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి వి. అజయ్ కుమార్ పర్యవేక్షించారు అనంతరం చిన్నారులు స్వచ్ఛభారతపై నాటికలను ప్రదర్శించారు. పాటలను పాడారు. ఈ పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న వారిని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అభినందించారు.

# అజికో బయోఫోర్ ఫార్మా యూనిట్ 2 ఘనంగా ప్రారంభం

- మంత్రి గుడివాడ చేతులు మీదగా ప్రారంభం
- హాజరైన ప్రముఖులు
- కంపెనీ హెడ్ పట్టాభిరామేశ్వరావు, అరుణకుమారి చేతులు మీదుగా ప్రారంభం





పరవాడ (విజయభాను న్యూస్) : అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో అజికో బయో ఫోర్ ఫార్మా యూనిట్ 2 పట్టాభి రామేశ్వరరావు, అరుణ కుమారి దంపతులు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగినది. ఈ ప్రారంభోత్సవం కార్యక్రమానికి విచ్చేసిన మంత్రులు బొత్స సత్యనారాయణ,, గుడివాడ అమర్ నాథ్ మరియు కరుమూరి వెంకట నాగేశ్వరరావు, పెందుర్తి ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ కి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమానికి జడ్పిటిసి పి ఎస్ రాజు, రక్షిత్ గ్రూప్ కంపెనీల ప్రతినిధి పి.దొరబాబు,పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మరియు వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..





# 'విమానం' ట్రైలర్ విడుదల




ఎప్పటికైనా విమానం ఎక్కాలి అనే ఓ చిన్న పిల్లాడు.. తన కొడుకు కోరికని తీర్చడానికి ఓ తండ్రి పడే వేదన.. కథాంశంతో 'విమానం' సినిమా చిత్రీకరించారు. శివ ప్రసాద్ దర్శకత్వంలో జీ స్టూడియోస్ కిరణ్ కొర్రపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తండ్రిగా నటిస్తున్న సముద్రకణి అంగ వైకల్యం ఉన్న పాత్రలో కనిపిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదల చేశారు. తండ్రి కొడుకుల ఎమోషనల్ రైడ్ వీరికి తోడు వీరిచుట్టూ ఉండే కొందరి కథలు మేళవించి ఈ సినిమా తీశారు. జూన్ 9న ఈ సినిమా ప్రేక్షకుల మందుకు రానుంది.

## బెల్లంకొండ శ్రీనివాస్ కొత్త సినిమా ప్రారంభం



మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌లతో ప్రేక్షకులను మెప్పించి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న ప్రామిసింగ్ యంగ్ హీరో శ్రీనివాస్ బెల్లంకొండ, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బ్లాక్ బస్టర్ 'భీమ్లా నాయక్' కి దర్శకత్వం వహించిన దర్శకుడు సాగర్ చంద్రతో చేతులు కలిపారు. ఈ చిత్రం యూనిక్ సబ్జెక్ట్‌తో కూడిన యాక్షన్ ఎంటర్‌టైనర్. దర్శకుడు, శ్రీనివాస్ బెల్లంకొండ కొత్త లుక్, క్యారెక్టర్‌లో ప్రజంట్ చేయనున్నారు. 0 ప్రముఖ నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ పై రిచ్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో భారీ బడ్జెట్‌తో రూపొందనుంది. రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

హరీష్ కట్టా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యుసర్ ఈరోజు ప్రత్యేక అతిథులతోమూవీ ఆఫీస్‌లో పూజ కార్య క్రమాలతో లాంఛనంగా ప్రారంభమైయింది. దర్శకుడు హరీష్ శంకర్ ముహూర్తం షాట్‌కు క్లాప్ కొట్టి, దర్శకుడు పరశురాంతో కలసి మేకర్స్‌కి స్క్రిప్ట్‌ను అందజేశారు. దర్శకుడు పరశురామ్ కెమెరా స్విచాన్ చేశారు.

## రివ్యూ: అహింస.. ఎలా ఉందంటే?




చిత్రం: అహింసబీ నటీనటులు: అభిరామ్ దగ్గుబాటి, గీతికా తివారీ, సదా, రజత్ బేడి, కమల్ కామరాజు, దేవి ప్రసాద్, తదితరులుబీ సంగీతం: ఆర్పీ పట్నాయక్‌బీ నేపథ్య సంగీతం: అనూప్ రూబెన్స్‌బీ మాటలు: అనిల్‌బీ సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డిబీ ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావుబీ నిర్మాణ సంస్థ: ఆనందీ ఆర్ట్స్ క్రియేషన్స్‌బీ నిర్మాత: కిరణ్‌బీ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: తేజబీ విడుదల తేదీ: 02-06-2023

కొత్తతరం నటులను పరిచయం చేయడంలోనూ, గాఢతతో కూడిన ప్రేమకథలను తెరకెక్కించడంలోనూ సిద్ధహస్తులు దర్శకులు తేజ. ఈసారి ఆయన దగ్గుబాటి కుటుంబానికి చెందిన అభిరామ్‌ను పరిచయం చేయడం.. రొమాంటిక్ ప్రేమకథను ఎంచుకోవడం 'అహింస'పై ఆసక్తిని పెంచింది.

హీరో నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా నిఖిల్ 20వ చిత్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. చనిఖిల్20కి 'స్వయంభూ' అనే టైటిల్ పెట్టారు. స్వయంభూ అంటే స్వయంగా ఉద్భవించినదని అర్థం. 'ఫస్ట్-లుక్ పోస్టర్ లో నిఖిల్ యుద్ధభూమిలో ఫెరోషియస్ వారియర్ గా కనిపించారు . పొడవాటి జుట్టు, ఒక చేతిలో ఆయుధం (ఈటె) , మరొక చేతిలో షీల్డ్‌తో పోరాట యోధుడిలా కనిపించారు. నిఖిల్ గెటప్, మేకోవర్ అద్భుతంగా వుంది. ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రారంభం కానున్న ప్రాజెక్ట్ ఫస్ట్ లుక్ తో క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. నిఖిల్ కెరీర్‌లోనే అత్యంత భారీ సినిమాగా స్వయంభూ నిలవనుంది. ఇది అత్యు త్తమ సాంకేతిక ప్రమాణాలతో రూపొం దుతోంది. రవి బస్రూర్ సంగీతం అందించగా, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాహరన్ ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి వాసుదేవ్ మునెప్పగరి డైలాగ్స్ అందిస్తున్నారు.




# 'టక్కర్' చిత్రం నుంచి 'రెయిన్ బో' పాట విడుదల



'నువ్వొస్తానంటే నేనొద్దంటానా', 'బొమ్మరిల్లు' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న చార్మింగ్ హీరో సిద్ధార్థ్ త్వరలో 'టక్కర్' అనే సినిమాతో సరికొత్తగా అలరించనున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్ తో కలిసి టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ కథానాయికగా నటిస్తున్నారు. 2023, జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో భారీస్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన 'టక్కర్' మూవీ టీజర్, ట్రైలర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సరికొత్త మేకోవర్ తో కనిపిస్తున్న సిద్ధార్థ్, ఈ చిత్రంతో సిద్ధార్థ్ మరో భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే అంచనాలున్నాయి. అలాగే ఈ సినిమా నుంచి విడుదలైన 'కయ్యాలే', 'పెదవులు వీడి మౌనం', 'ఊపిరే' పాటలు విశేష ఆదరణ పొందాయి. ఇక ఇప్పుడు ఈ చిత్రం నుంచి 'రెయిన్ బో' అనే పాట విడుదలైంది.'టక్కర్' నుంచి 'రెయిన్ బో' అనే నాలుగో పాటను ఈరోజు(జూన్ 2) సాయంత్రం 4 గంటలకు విడుదల చేసింది చిత్ర బృందం. ఈ చిత్రానికి నివాస్ కె ప్రసన్న సంగీతం అందించగా, కృష్ణకాంత్ అన్ని పాటలకు సాహిత్యం అందించారు. 'కయ్యాలే' ఫుల్ వీడియో సాంగ్ ని విడుదల చేసి సరికొత్త ట్రెండ్ కి శ్రీకారం చుట్టిన మేకర్స్.. 'రెయిన్ బో' సాంగ్ కూడా ఫుల్ వీడియో విడుదల చేసి ఆ ట్రెండ్ ని కొనసాగించారు. నాయకా నాయికలు కారులో వెళ్తూ, దారిలో కలిసిన వారితో సరదాగా గడుపుతున్నట్లుగా పాట చిత్రీకరణ సాగింది. నివాస్ కె ప్రసన్న మరోసారి తన మ్యూజిక్ తో మ్యాజిక్ చేశారు. సంగీతానికి తగ్గట్లుగా సిద్ధార్థ్ తన ఎనర్జిటిక్ డ్యాన్స్ తో ఆకట్టుకున్నారు. "రెయిన్ బో చివరే ఒక వర్ణం చేరెలే" అంటూ కృష్ణకాంత్ పాటను ఎత్తుకోవడమే కొత్తగా ఎత్తుకున్నారు. ఆయన సాహిత్యం ఎప్పటిలాగే కట్టిపడేసేలా ఉంది. సంగీతానికి, సాహిత్యానికి తగ్గట్లుగా బెన్నీ దయాల్, వృష బాబు ఎంతో ఉత్సాహంగా పాటను ఆలపించారు.

మొత్తానికి 'టక్కర్' నుంచి విడుదలవుతున్న ప్రతి పాట ఎంతగానో ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలను పెంచేస్తున్నాయి.ఈ రొమాంటిక్ యాక్షన్ రైడ్ ప్రేక్షకులను ఆకట్టుకొని ఘన విజయం సాధి స్తుందని మేకర్స్ ఎంతో నమ్మకంగా ఉన్నారు. ఈ సినిమాలో అభిమన్యు సింగ్, యోగి బాబు, మునీశ్ కాంత్, ఆర్జే విఘ్నేశ్ కాంత్ తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. నివాస్ కె. ప్రసన్న సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ గా వాంచినాథన్ మురుగేశన్, ఎడిటర్ గా జీవి గౌతమ్, ఆర్ట్ డైరెక్టర్ గా ఉదయ కుమార్ కె వ్యవ హరిస్తున్నారు.

# నటులకు ఆ ఆలోచనే ఉండకూడదు




తెలుగులో వరుస సినిమాలతో జోరు చూపిస్తూ.. స్టార్ నాయికగా మెరుపులు మెరిపిస్తోంది శ్రీలీల. ఓ వైపు బాలకృష్ణ, పవన్ కల్యాణ్ లాంటి అగ్రతారలతో కలిసి నటిస్తూనే.. మరోవైపు రామ్, నితిన్, వైష్ణవ్ తేజ్ లాంటి యువ హీరోలతోనూ ఆడిపాడుతోంది. అయితే వరుసగా అగ్ర హీరోల సినిమాల్లో చేయడం వల్ల ఏదైనా ప్రత్యేక ముద్ర పడుతుందని ఎప్పుడైనా భయం కలిగిందా? అని ప్రశ్నిస్తే.. లేదంటూ తనదైన శైలిలో బదులిచ్చింది శ్రీలీల. "సీనియర్లతో వరుస సినిమాలు చేసిందని ఒకలా.. యువ హీరోలతోనే చేస్తోందని మరొకలా ఓ ప్రత్యేక ఇమేజ్ ఆపాదించే రోజులు ఎప్పుడో పోయాయి. జనం అసలలా ఆలోచించట్లేదు. చాలా అప్‌డేట్ అయ్యారు. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తున్నారు. సినిమా అనేది ఒకరు సృష్టించిన కథ. దాన్ని తెరపైకి తీసుకొస్తున్నారంటే అందులోని పాత్రలకు సరిగ్గా సరిపోయే తారల్నే ఎంచుకుంటారు. మనకిచ్చిన ఆ పాత్రకు నూటికి నూరు శాతం న్యాయం చేయగలుగుతున్నామా, లేదా? అన్నదే ప్రేక్షకులు చూస్తారు తప్పితే పక్కన ఉన్నది అగ్ర హీరోనా, యువ హీరోనా అన్న ఆలోచన వాళ్లకు ఉండదు. వాళ్లకే కాదు ఏ ఆర్టిస్ట్‌కు ఈ ఆలోచన ఉండకూడదు. అసలు వయసును ఎప్పుడూ దృష్టిలోకి రానీయకూడదు" అని చెప్పింది శ్రీలీల.

# కార్తీ తదుపరి చిత్రంలో ప్రముఖ హీరో కీలక పాత్ర



కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ తన సిల్వర్ జూబ్లీ చిత్రం 'జపాన్' సినిమా షూటింగ్‌లో ఉన్నాడు. జపాన్ చివరి షెడ్యూల్ ఈ ఉదయం చెన్నైలో ప్రారంభం కాగా కార్తీ 26 ఇటీవలే ప్రారంభమైంది మరియు ఈ సంవత్సరం చివరి నాటికి ఈ చిత్రం పూర్తవుతుంది. తాజాగా ఇప్పుడు కార్తీ 27వ సినిమాకి సంబంధించిన ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఫిల్మ్ సర్కిల్స్‌లోని తాజా రిపోర్ట్స్ ప్రకారం, ప్రముఖ నటుడు అరవింద్ స్వామి కార్తీ 27 లో కీలక పాత్రలో నటించనున్నారు. కార్తీ తన 26వ ప్రాజెక్ట్‌ని పూర్తి చేసిన తర్వాత ఈ ఏడాది చివరి నుండి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహించనున్న ఈ కార్తీ 27 చిత్రాన్ని 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఆయన సోదరుడు, నటుడు సూర్య నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## ముగింపు కాదు.. అంతకు మించి



కథానాయకుడు రామ్... దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. శ్రీనివాస చిట్టూరి నిర్మాత. శ్రీలీల కథానాయిక. ఈ సినిమా తాజాగా ఓ కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని రామ్ ట్విటర్ వేదికగా తెలియజేశారు. "24రోజుల యాక్షన్ సన్నివేశాల్ని పూర్తి చేశాం. ఇది క్లైమాక్స్ కాదు.. అంతకు మించి" అంటూ రామ్ ట్వీట్‌లో పేర్కొన్నారు. దీంతో ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. పూర్తి స్థాయి మాస్ యాక్షన్ కథాంశంతో రూపొందుతోన్న చిత్రమిది. రామ్ సరికొత్త మాస్ లుక్‌తో కనిపించనున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా.. దసరా సందర్భంగా అక్టోబరు 20న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కూర్పు: తమ్మిరాజు, ఛాయాగ్రహణం: సంతోష్ డిటాకే.



## ఆఫ్ఘనిస్తాన్ సంచలనం - తొలి వన్డేలో శ్రీలంకపై గెలుపు

**కొలంబో:** మహింద్ర రాజపక్సా స్టేడియంలో శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు సంచలన విజయం సాధించింది. మూడో వన్డేల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి వన్డేలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు 6వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 268పరుగులకు ఆలౌటైంది. అలసంక(91), ధనుంజయ(51), ఓపెనర్ నిస్సంక(38), , హేమంత(22) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఫరూఖీ, అహ్మద్‌కు రెండేసి, అజ్మతుల్లా, ముజీబ్, నూర్ అహ్మద్, నబికి ఒక్కో వికెట్ దక్కాయి. 269పరుగుల లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్ జట్టు 46.5ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి ఛేదించింది. జద్రాన్(98), షా(55), షాహిది(38) బ్యాటింగ్‌లో రాణించారు. రజితకు రెండు, లాహిరు, మతీషాకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జద్రాన్‌కు లభించగా.. ఇరుజట్ల మధ్య రెండో వన్డే ఆదివారం (నేడు) జరగనుంది.



## సెమీస్‌లో లక్ష్యసేన్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో లక్ష్యసేన్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో అతడు 21-19, 21-11తో లియాంగ్ జన్ హావో (మలేసియా)ను ఓడించాడు. ఈ పోరులో తొలి గేమ్‌లో మాత్రమే సేన్‌కు లియాంగ్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. విరామ సమయానికి 10-11తో నిలిచిన భారత స్టార్.. ఆ తర్వాత ఇంకా తడబడి 10-16తో గేమ్ చేజార్చుకునేలా కనిపించాడు. కానీ అనూహ్యంగా పుంజుకున్న సేన్.. వరుస పాయింట్లతో 17-17తో స్కోరు సమం చేయడమే కాక.. అదే జోరులో గేమ్ గెలిచాడు. రెండో గేమ్‌లో సేన్ దూకుడుగా ఆడాడు. 11-8తో బ్రేక్‌కు వెళ్లాడు. అయితే పట్టు వదలని లియాంగ్ 11-13తో సేన్‌ను సమీపించాడు. ఈ దశలో విజృంభించిన భారత కుర్రాడు.. వరుస పాయింట్లతో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ సీజన్లో ఓ టోర్నీలో సెమీస్ చేరడం లక్ష్యకు ఇదే తొలిసారి. మరోవైపు యువ షట్లర్ కిరణ్ జార్జ్ పోరాటానికి తెరపడింది.

# విశాఖ పోర్టుకు 2023 సేఫ్టీ అవార్డు

**- గ్రీన్ టెక్ అవార్డు పట్ల సిబ్బందిని అభినందించిన పోర్ట్ చైర్మన్ అంగముత్తు**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : 2023 సేఫ్టీ అవార్డులలో విశాఖపట్నం పోర్టు అధారిటీ విన్నర్ అవార్డును కైవసం చేసుకుంది సేఫ్టీ ఎక్సెన్స్ లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచినందుకు పోర్టును అవార్డు వరించింది. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని గ్రీన్ టెక్ ఫౌండేషన్ సంస్థ న్యూఢిల్లీలో నిర్వహించింది. సంస్థలో పని చేసే ఉద్యోగులు మరియు కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు మరియు సంస్థ పురోగతికి, ప్రమాదాలు ఘటనలను సమర్ధవంతంగా నిరోధించేందుకు చేపట్టే చర్యలు రరిశీలించి ఏటా గ్రీన్ టెక్ సంస్థ అవార్డులను ప్రధానం చేస్తుంది. న్యూ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ సీఎంఈ రవికుమార్ మరియు సేఫ్టీ అధికారులు గ్రీన్ టెక్ అవార్డును స్వీకరించారు. పోర్టుకు అవార్డు రావడం పట్ల, ఈ ఘనతను సాధించిన సిబ్బందిని పోర్టు చైర్ పర్సన్ డాక్టర్ ఎం. అంగముత్తు ఐఏఎస్ ప్రశంసించారు. సిబ్బంది రక్షణకు అవసరమైన అన్ని చర్యలను పటిష్టంగా అమలు పరచాలని ఆయన సూచించారు.

# విద్య విభాగంలో నీలవేణికి డాక్టరేట్



ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్య విభాగం పరిశోధక విద్యార్థిని బి.నీలవేణికి ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు టి.షారోన్ రాజు పర్యవేక్షణలో ' ఏ స్టడీ ఆన్ ద జాబ్ శాటిసిఫేక్షన్ ఆఫ్ టీచర్స్ అండ్ అకడమిక్ ఎచీవ్‌మెంట్ ఆఫ్ స్టూడెంట్స్ ఇన్ మోడల్ స్కూల్స్ ఆఫ్ నార్త్ కోస్టల్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను నీలవేణి స్వీకరించారు.

# అమిత్ షా, జేపీ నడ్డాతో చంద్రబాబు భేటీ



దిల్లీ: భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో తెదేపా అధినేత చంద్రబాబు భేటీ అయ్యారు. శనివారం మధ్యాహ్నం దిల్లీ చేరుకున్న చంద్రబాబు.. రాత్రి 8 గంటల సమయంలో అమిత్ షా నివాసంలో జేపీ నడ్డా షాను కలిశారు. చంద్రబాబు దిల్లీ పర్యటన ప్రైవేటు కార్యక్రమమని పార్టీ వర్గాలు తెలిపాయి. 2019 ఎన్నికల తర్వాత ఆజాది కా అమృత్ మహోత్సవ్ సమయంలో ఒకసారి ప్రధాని మోదీని చంద్రబాబు కలిశారు. జీ20 సన్నాహక సదస్సుకు హాజరయ్యేందుకు దిల్లీ వెళ్లినప్పుడు మరోసారి భేటీ అయ్యారు. టచ్‌లో ఉండాలంటూ ఆ సందర్భంగా చంద్రబాబుకు మోదీ సూచించిన విషయం తెలిసిందే. తాజాగా చంద్రబాబు జేపీ నడ్డా, అమిత్ షాతో భేటీ కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వచ్చే ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కలిసి పోటీ చేస్తాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో చంద్రబాబు దిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

## రైల్వే నా బిడ్డవంటిది.. ఈ ప్రమాదం 21వ శతాబ్దపు అతి పెద్ద ఘటన

బాలేశ్వర్: ఒడిశాలో జరిగిన భారీ రైలు ప్రమాదం.. 21వ శతాబ్దపు అతిపెద్ద ఘటన అని పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. అలాగే రైల్వే శాఖ తనకు బిడ్డతో సమానమని, దాని క్షేమం కోసం సూచనలు ఇవ్వడానికి సిద్ధమని తెలిపారు. ఇది రాజకీయాలు చేసే సమయం కాదని వ్యాఖ్యానించారు. 'నేను మూడుసార్లు రైల్వే మంత్రిగా పనిచేశాను. అప్పటి నుంచి నేను చూసిన వాటిలో 21వ శతాబ్దపు అతిపెద్ద ఘటన ఇది. ఇలాంటి కేసుల్ని రైల్వే సేఫ్టీ కమిషన్‌కు అప్పగించాలి. వారు విచారణ జరిపి, నివేదిక ఇస్తారు. అలాగే నాకు తెలిసినంత వరకు కోరమాండల్‌లో యాంటీ కొలిజన్ డివైస్ లేదు. అదే ఉండిఉంటే.. ఈ స్థాయి ప్రమాదం జరిగేది కాదు. చనిపోయిన వారిని వెనక్కి తీసుకురాలేం. కానీ సాధారణ పరిస్థితులు నెలకొనేలా తక్షణ చర్యలు తీసుకోవడమే ఇప్పుడు మనముందున్న కర్తవ్యం. రైల్వే శాఖ రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. అలాగే బెంగాల్‌కు చెందిన వారికి ప్రభుత్వం తరఫు నుంచి రూ.5 లక్షలు అందిస్తాం.

# రైలు ప్రమాదం..

## 316మంది ఏపీ వాసులు సేఫ్, 141మంది ఫోన్లు స్విచ్ఛాఫ్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 288 మంది దుర్మరణం చెందగా, 900 మందికి పైగా గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. అయితే, ప్రమాదానికి గురైన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్–హావ్‌డా ఎక్స్‌ప్రెస్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రయాణికులు ఎంతమంది ఉన్నారనే దానిపై రైల్వే శాఖ వివరాలు వెల్లడించింది. రాష్ట్రానికి చెందిన అధికారులు.. రైల్వేశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని వివరాలు సేకరించారు. రెండు రైళ్లలో ప్రయాణించిన ఏపీకి చెందిన వారి యోగక్షేమాలపై రైల్వే శాఖప్రకటన విడుదల చేసింది. ఎంత మంది రిజర్వేషన్ చేసుకున్నారు? వారిలో ఎంత మంది రైల్లో ప్రయాణించారు?ఎంత మంది ఆచూకీ తెలియడం లేదనే దానిపై స్పష్టత ఇచ్చింది.

**కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో..**

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం సంభించినప్పుడు అందులో ప్రయాణిస్తున్న రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు.. రిజర్వేషన్ చేసుకుని ప్రయాణిస్తున్న వారి వివరాలు వెల్లడించారు. రైల్లో ప్రయాణించిన వారిలో విశాఖపట్నానికి చెందిన 165 మంది, రాజమహేంద్రవరం నుంచి 22 మంది, విజయవాడకు చెందిన 80 మంది ..మొత్తం 267 మంది సురక్షితంగా ఉన్నట్టు అధికారులు నిర్ధరించారు. పాక్షికంగా గాయపడిన వారిలో విశాఖ నుంచి 11, ఏలూరుకు చెందిన ఇద్దరు, విజయవాడకు చెందిన ఇద్దరు.. మొత్తం 20మంది ఉన్నారు. ఈమేరకు ప్రయాణికుల వివరాలు తమ వద్ద ఉన్నాయని రైల్వేశాఖ అధికారులు తెలిపారు. రిజర్వేషన్ ఉన్నా ఈ రైల్లో ప్రయాణం చేయని వారి జాబితాలో విశాఖ నుంచి 57 మంది, ఏలూరు నుంచి ముగ్గురు, విజయవాడ నుంచి 22 మంది ..మొత్తం 82 మంది ఉన్నారు. ఫోన్ స్విచ్ఛాఫ్ లేదా సమాధానం ఇవ్వని ప్రయాణికుల సంఖ్య 113గా తేల్చారు. ఇందులో విశాఖ నుంచి 76 మంది , రాజమహేంద్రవరం నుంచి 9, విజయవాడ నుంచి 28 మంది ఫోన్‌లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. వీరి ఆచూకీ తెలుసుకునేందుకు రైల్వే శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

**యశ్వంత్‌పూర్–హావ్‌డా ఎక్స్‌ప్రెస్‌లో..**

యశ్వంత్‌పూర్–హావ్‌డా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 49 ప్రయాణికులు సురక్షితంగా ఉన్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. వీరిలో విశాఖ నుంచి 17 మంది, రాజమహేంద్రవరం నుంచి ముగ్గురు, విజయవాడ నుంచి 21 మంది, బాపట్ల నుంచి 8మంది మొత్తం 49 మంది క్షేమంగా ఉన్నారు. ఇదే రైలులో ప్రయాణిస్తూ పాక్షికంగా గాయపడిన వారు విశాఖ నుంచి ఇద్దరు ఉన్నట్టు గుర్తించారు. రిజర్వేషన్ ఉన్నా ఈ రైల్లో ప్రయాణించని వారు విశాఖ నుంచి ఐదుగురు, ఏలూరు నుంచి ఒకరు, విజయవాడ నుంచి నలుగురు మొత్తం 10మందిగా గుర్తించారు. ఇదే రైల్లో రిజర్వేషన్ చేసుకున్న వారిలో ఫోన్ స్విచాఫ్ లేదా ఫోన్ చేసినా స్పందించని వారు విశాఖ నుంచి 9, విజయవాడ నుంచి 16, నెల్లూరు నుంచి ముగ్గురు.. మొత్తం 28 మంది ప్రయాణికుల ఆచూకీ తెలియలేదని రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, రైల్వేశా తెలిపాయి. వీరికి ఎలాంటి ప్రమాదం జరిగింది? వీరి ఆచూకీ ఎందుకు తెలియడం లేదు?వేరే ప్రాంతంలో ఎక్కడైనా ఉన్నారా? ఎందుకు ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయో తెలుసుకునేందుకు ఘటనా స్థలికి ప్రత్యేక బృందాలు కూడా వెళ్లాయి. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వివరాలు సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆచూకీ తెలియని వారి ఫోన్లు ఏ లొకేషన్‌లో స్విచ్ఛాఫ్ అయ్యాయో విశ్లేషించేందుకు డేటా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# రైలు ప్రమాద బాధితులకు పూర్తి సహాయ, సహకారాలను అందిస్తున్నాము

## అన్ని కలెక్టరేట్లలో కంట్రోల్ రూముల ఏర్పాటు : విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ఒడిశా లో జరిగిన రైలు ప్రమాద బాధితులకు పూర్తి సహాయ, సహకారాలు అందించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం విశాఖ జిల్లా కలెక్టరేట్లో రైలు ప్రమాద సంఘటనపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు, హౌసింగ్ మినిస్టర్ జోగి రమేష్ , జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున, పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మ లతో కలిసి పత్రికా విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గారి నేతృత్వంలో విజయవాడ లో అధికారులతో సమీక్ష నిర్వహించారని తెలిపారు. ఈ సంఘటనలో ఎవరైతే మన రాష్ట్రానికి సంబంధించి క్షతగాత్రులు , చనిపోయిన వారు , ప్రమాదానికి గురి అయిన వారు గాని, అక్కడ ఉన్న వారిని గాని సురక్షితంగా తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించేందుకు, చనిపోయిన వారిని వారి బంధువులకు అప్పగించుటకు పూర్తి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి గారి ఆదేశంతో ఇప్పటికే రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ముగ్గురు ఐఏఎస్ అధికారుల బృందం ఒడిశా లోని రైలు ప్రమాద స్థలం చేరుకున్నట్లు తెలిపారు. ఈ రైలు ప్రమాదంలో 12841 షాలిమార్–చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్ప్రెస్ , డౌన్లైన్లో ప్రయాణిస్తున్న 12864 బెంగళూరు–హౌరా సూపర్ఫాస్ట్ ఎక్స్ప్రెస్ ప్రమాదానికి గురి అయినట్లు తెలిపారు. కోరమండల్ ఎక్స్ప్రెస్ లో ఆంధ్రప్రదేశ్ లో దిగవలసిన వారు 482 మంది ఉన్నారని , వీరిలో విశాఖలో 309 మంది దిగవలసి ఉందని , కానీ 165 మంది సురక్షితంగా ఉన్నారని అన్నారు. 11 మంది గాయపడ్డారని , 57 మంది ప్రయాణం చేయలేదని , 76 మంది జాడ ఇంకా తెలియవలసి ఉందని తెలిపారు .అదేవిదంగా రాజమండ్రి లో దిగవలసిన 31 మందిలో 22 మంది సురక్షితంగా ఉన్నారని, 9 మంది గుర్తింపు తెలియాల్సి ఉందన్నారు. విజయవాడలో 137 మంది దిగవలసి ఉండగా , 80 మంది సురక్షితంగా ఉన్నారని, 7 గురు గాయపడ్డారని అన్నారు. 22 మంది ప్రయాణం చేయలేదని 28 మంది ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని పేర్కొన్నారు. యస్వంతపూర్ రైలులో 89 మంది ఆంధ్రప్రదేశ్ లో దిగవలసిన వారు వున్నారని వివరించారు. రేపు ఉదయానికి పూర్తి సమాచారం అందుతుందని తెలిపారు . ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రైల్వే అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులను గమ్యస్థానాలకు చేర్చటానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు.

విశాఖపట్నం, విజయనగరం , శ్రీకాకుళం , రాజమండ్రి, ఏలూరు , విజయవాడ జిల్లాల కలెక్టర్ల కార్యాలయాలలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి బాధితుల కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇచ్చాపురం నుంచి ఒంగోలు వరకు ఉన్న అన్ని ప్రభుత్వాసుపత్రులను అలర్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిస్సా రైలు సంఘటన స్థలానికి 108 వాహనాలు 25 , ప్రైవేట్ అంబులెన్స్ లు 25 మొత్తం 50 , అదేవిధంగా 15 మహాప్రస్థానం వాహనాలను పంపినట్లు పేర్కొన్నారు. నేవీ , ఎయిర్ఫోర్స్ సహాయం కూడా తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరు చనిపోయినట్లు సమాచారం లేదని అన్నారు. సంఘటన జరిగినప్పటినుండి ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ టైమ్ టు టైమ్ అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ భువనేశ్వర్ లో రెండు ఆసుపత్రులను గుర్తించి అక్కడే క్షతగాత్రులకు ట్రీట్మెంట్ కు చర్యలు చేపట్టామన్నారు. కటక్, భువనేశ్వర్ లో రెండు చోట్ల రెండు మెడికల్ టీములను ఏర్పాటు చేశామని వివరించారు. సంఘటన స్థలం నుంచి దూర ప్రాంతాలకు వెళ్ళవలసిన వారికి ప్రత్యేకల ప్రయాణ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినందున ప్రయాణికుల బంధువులు వాట్సాప్ ద్వారా ప్రయాణికుల ఫోటోలు, వివరాలు తెలియజేయాలని అన్నారు. ప్రమాద బాధితులకు ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని , ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com